నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
ఆదివారం | నవంబర్ 17, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసిన రవీందర్

నవతెలంగాణ-నకిరేకల్



మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని శనివారం మునుగోడు క్యాంప్ ఆఫీసులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమంలో నాయకులు గారపాటి రవీందర్ రెడ్డి , యూసుఫ్, చనగాని రాజశేఖర్ గౌడ్, ఒంటెపాక నక్షత్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి రైతులు మద్దతు ధర పొందాలి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్న ఆడిశర్లపల్లి గ్రామ సమీపాన వద్ద ఏర్పాటు చేసినటువంటి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోసిన ధాన్యాన్ని పొలాల వద్ద ఆరబెట్టుకొని తేమశాతం ఎక్కువ లేకుండా నాణ్యమైన సన్న రకం, దొడ్డు రకం దాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి జానకిరాములు, ఏఈఓ లు మల్లేష్, సురేష్, మాధురి, సీఈఓ పల్లా తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు

భవిష్యత్తు తరాలకు ఆదర్శం

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



నవతెలంగాణ-దేవరకొండ

కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వాతంత్ర్య సమరయోధుడు ,తెలంగాణ ఉద్యమ కారుడు, మాజీ మంత్రి కొండ లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని అఖిల భారత నిత్య అన్నదాన సత్రం మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని ఎమ్మెల్యే అన్నారు. విలువలకు కట్టుబడిన వ్యక్తిగా జీవితాంతం అదే విలువలతో బతికారని ఆయన సేవలను కొనియాడారు. 1952లో బాపూజీ రూపొందించిన సహకార సంఘాల దేశంలోనే ప్రప్రథమం కావడం విశేషం అన్నారు. చేనేత ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం 1952లో 'హైకో'ను ఏర్పాటు చేశానన్నారు. టీఆర్ఎస్ ఆవిర్భావానికి ఇల్లు ఇచ్చి ,టీడీపీ పాలనలో ఇల్లును పోగొట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అలంపల్లి నర్సింహా,అఖిల భారత సంఘం అధ్యక్షులు కండగట్ల స్వామి, భద్రాచలం పద్మశాలి అన్నసత్రం అధ్యక్షులు బోసిక యాదగిరి, పద్మశాలి అధ్యక్షులు శీరాందాస్ కృష్ణయ్య,కార్యదర్శి పగడిమర్రి రాఘు రాములు, కోశాధికారి పూలిజాల శ్రీనివాస్,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వేంకటేశ్వర్లు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, కొంద్ర శ్రీశైలం యాదవ్, తిపర్తీ రుక్మా రెడ్డి,హన్మంతు వెంకటేష్ గౌడ్,చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు పులిపాటి నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- రెవెన్యూ పైలెట్ ప్రాజెక్టుపై సమీక్ష

నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్



సర్వేను త్వరగా పూర్తిచేసి అర్హులైన రైతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలపై పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న సర్వే తీరుతెన్నులను శనివారం తహసిల్దార్ కార్యాలయంలో పైలెట్ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ లతో కలిసి టీం లీడర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు సర్వే పూర్తి అయిన రిపోర్టులను పరిశీలించి, ప్రభుత్వ భూమి లో ఎంజాయ్మెంట్ లో ఉన్న రైతుల యొక్క వివరాలను గ్రామాల వారిగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి అప్లికేషన్లను త్వరితగతిన పరిశీలించి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేశారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతానని ఆమె వారికి తెలిపారు. అనంతరం ఆమె తునికినూతల గ్రామంలో సర్వే జరిగిన ప్రాంతాలలో పర్యటించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. రైతుల నుండి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారులు అనిల్ కుమార్, గుగులోతు దశరథ, కృష్ణయ్య ,టీం లీడర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

19న ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు



నవతెలంగాణ-క్లాక్‌టవర్

ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న ఆర్టీసీ డిపోల ముందు జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నల్లగొండ డిపో గౌరవాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం నల్గొండ ఆర్టీసీ డిపోలో కార్మికులకు 19 తేదీ జరుగు ధర్నా జయప్రదం చేయాలని కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ 2019 డిసెంబర్ నుండి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలు ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలని, సామాజిక భద్రత పథకాలైన పిఎఫ్, ఎస్ ఆర్ బి ఎస్,ఎస్ బి టి ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టును నియమించాలని, ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలను రద్దుచేసి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ సభ్యుల నియామకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూ కొత్త సభ్యులను నియమించడం సిగ్గుచేటన్నారు. ఆర్టీసీ కార్మికుల వేధింపులను అరికట్టాలని, కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని ఈ నెల 19న ఆర్టీసీ డిపోల ముందు జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ డబ్ల్యు ఎఫ్ రీజియన్ అధ్యక్షుడు కందుల నరసింహ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, మారగోని నగేష్ శివ తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-దేవరకొండ

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని శనివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 7వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా సంక్షేమ హాస్టల్లో నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, అద్దె భవనాల్లో ఉన్నటువంటి హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చోల్లేటి భాస్కరాచారి, డాక్టర్ ఏకుల రాజారావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయితగోని జనార్ధన్ గౌడ్, కూరెళ్ళ కృష్ణాచారి, తూటపల్లి శీను,కొండ లలిత, జిల్లా రాములు, రాస మల్ల నాగయ్య ముదిరాజ్, కలగోని రమేష్ గౌడ్, లింగంపల్లి మధు, రెడ్డి కోటేష్, అంజి, ప్రైవేట్ కాలేజీ యజమానాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య



నవతెలంగాణ-నిడమనూరు


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో జరిగిన ఆ పార్టీ మండల 8వ మహాసభలలో ఆయన మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి కింద ఇస్తున్న రైతుబంధు , రైతుబీమా పథకాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయడంలో ఘోర వైఫల్యం చెందారని విమర్శించారు. అటు పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల జరిగి సంవత్సరం కావస్తున్న నేటికీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల పైన ఆర్థిక భారాలు మోపారని వాటికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా నేడు పండించిన పంటకు కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే గత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ప్రపంచ మార్కెట్లో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పడిపోయినా భారత దేశంలో వాటిని తగ్గించకుండా ప్రధానమంత్రి మోడీ నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంవత్సరం అవుతున్నా చర్యలు తీసుకోవడంలేదన్నారు. అనంతరం 15 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. రెండోసారి కార్యదర్శిగా కందుకూరి కోటేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. మండల కమిటీ సభ్యుల కోమండ్ల గురవయ్య నల్లబోతు సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ మాసభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శీను మండల కార్యదర్శి కందుకూరి కోటేషు సీనియర్ నాయకులు కత్తిలింగారెడ్డి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డివిజన్ కార్యదర్శి రమేష్, త్రిపురారం మండల కార్యదర్శి ధైద శ్రీను,మండల నాయకులు మణికంటి చంద్రశేఖర్,కొంచెం శేఖర్,పాలోజు సుదర్శన్,మెరుగు రాములు,ముత్యాల కేశవులు,కొండేటి సామంతు,ఇంజమూరు శివకృష్ణ కొట్టేపాక అంజయ్య, తోటపల్లి నారాయణ, కొండేటి అరుణ,రామరాజు యశోద తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల సేవలు అభినందనీయం

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

సమాజంలో జర్నలిస్టులు అందిస్తున్నటువంటి అక్షర సేవలు అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి అన్నారు. శనివారం జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా స్థానిక పాలసీకల కేంద్రం నందు విలేకరులతో కలిసి కేక్ కట్ చేసి ఆయా పత్రిక విలేకరులకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పత్రిక రిపోర్టర్లు ప్రజలను చైతన్య పరుస్తూ అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ వారధిగా పనిచేస్తున్నారన్నారని ప్రతిరోజు వారు చేస్తున్నటువంటి అక్షర సేవలు ఎంతో అభినందనీయమన్నారు, ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, మంగ్యా నాయక్, అనిల్, మండల ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏరుకొండ రాము, దుండిగళ్ల అశోక్, పాషా, వెంకటరమణ, శ్రీనివాస్, ముత్యాలు, మైనుద్దీన్, శ్రీధర్, మహేందర్, కార్తీక్, సతీష్, అంజి, సైదులు, గిరి, సేవ, ఖదీర్, శేఖర్, నాగరాజు, యాదయ్య, రవికుమార్ ఆయా పత్రికల విలేకరులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సైని సన్మానించిన సంతోష్ యాదవ్

నవతెలంగాణ-మర్రిగూడ

మండలానికి నూతన వచ్చిన ఎస్ఐ ఎం.కృష్ణారెడ్డిని మండలంలోని ఎరగండ్లపల్లి గ్రామానికి చెందిన యువజన నాయకులు,సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు మంగళ వాయిద్యాలతో యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, అఖండ జ్యోతి ప్రజ్వలన, హెూమం, ధ్వజారోహణము తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గర్రె రామ్మూర్తి వెంకటలక్ష్మి, బ్రహ్మదేవర విశ్వనాథం అరుణ, బ్రహ్మదేవర లక్ష్మయ్య సువర్ణ, బ్రహ్మదేవర పద్మ కృష్ణమూర్తి, గర్రె వెంకన్న, శ్రీనివాస్, వీర్లపాటి రాంబాబు, బ్రహ్మదేవర నరసింహారావు, వీర్లపాటి కృష్ణ, గర్రె మురళీమోహన్, బ్రహ్మదేవర రమేష్, రామకృష్ణ, పోతుగంటి రామ్మూర్తి ,సోమా అశోక్, వీర్లపాటి జానయ్య పాల్గొన్నారు.

నేడు గ్రూప్-3 పరీక్షలు

- మిర్యాలగూడలో 28 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 7944 మంది అభ్యర్థులు
- 4 రూట్ లు, 8 ఫ్లేయింగ్ స్క్వాడ్‌లు
- పకడ్బందీ ఏర్పాట్లు: సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నేతృత్వంలో ఈ నెల 17 18 తేదీలలో గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెం పాటి తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో మండలంలో మొత్తం 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపర్డెంట్ ఇద్దరు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, నియామకం చేసినట్లు తెలిపారు. 28 కేంద్రాలకు సుమారు 420 ఇన్విజిలేటర్ల నియమించారన్నారు. పరీక్షలకు 7,944 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. 4 రూట్ లు, 8 ఫ్లేయింగ్ స్క్వాడ్ లు, పరీక్షల పర్యవేక్షణ చేయనున్నారని తెలిపారు. ఈనెల 17న ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్-1 పరీక్ష ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2బి30 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 18న ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్- 3 పరీక్ష ఉంటుందన్నారు. ప్రతి కేంద్రంలో పరీక్షకు హాజరై అభ్యర్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు గంట ముందే చేరుకోవాలని కోరారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ తీసుకున్న తదుపరి కేంద్రానికి లోపల అనుమతిస్తారన్నారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు..

గ్రూప్- 3 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

- పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు
- ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ జిల్లాలో నేడు, రేపు 17 వ తేది (ఆదివారం), 18 వ తేది (సోమవారం) రెండు రోజులు పాటు జరిగే గ్రూప్-3 రాత పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ అన్ని రకాల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.నల్గొండ పట్టణంలో 60 పరీక్షా కేంద్రాలు, మిర్యాలగూడ పట్టణంలో 28,మొత్తం 88 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని మొత్తం 28,353 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.ఈ పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు, మూసి వేయాలని, మరియు పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దు అని ,రీక్షలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందు పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలని అన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందే ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసు వారికి సహకరించగలరని పేర్కొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేది చదువే

- డా.బెల్లి యాదయ్య

నవతెలంగాణ-నకిరేకల్



కష్టాలు కడగండ్లకు ఓర్పి క్రమశిక్షణతో ఒక లక్ష్యం పెట్టుకొని చదివితే విద్యార్థులు తప్పక ఫలితం సాధిస్తారని, పేదరికాన్ని రూపుమాపేది చదువేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా.బెల్లి యాదయ్య అన్నారు. శనివారం కళాశాల ఐక్యూఏసి నిర్వహించిన మీటింగ్ విత్ స్లోలెర్నర్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితంలో డిగ్రీ చదివే అవకాశం ఇంకా అందరికీ రావట్లేదన్నారు. తల్లిదండ్రులు పిల్లల అభివృద్ధి పట్ల శ్రద్ధకనబరచినపుడే ఆ కుటుంబాలు ఉన్నత విద్యలోకి వస్తున్నారన్నారు. పేదరికం, అల్పాదాయం మూలంగా గ్రామీణ విద్యార్థులు చిన్న చితకా ఉపాధిమార్గాల్లో తృప్తిపడి డిగ్రీలో వెనకబడుతున్నారన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డి, హరిత, మధుసూదన్ రెడ్డి, శంకర్, ఉపేందర్, సతీష్ కార్యాలయ సిబ్బంది సయ్యద్, వెంకన్న, సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కళలకు జీవం పోసే బాధ్యత ప్రజలందరిపై ఉంది

- నర్రా ఫౌండేషన్ చైర్మెన్ డా. నర్రా ప్రవీణ్ రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

భారతీయ తాత్వికత, పుడమి తల్లి గుణం కళలల్లో ఇమిడి ఉందని అటువంటి కళలకు జీవం పోసే బాధ్యత కళాకారులకే గాక ప్రజలందరిపై ఉందని తెలంగాణ తెలుగు పరిశోధక మండలి, నర్రా ఫౌండేషన్ చైర్మెన్, నవలా రచయిత డా. నర్రా ప్రవీణ్ రెడ్డి అన్నారు నార్కట్ పల్లి మండల కేంద్రంలో మూడు రోజులుగా జరిగిన మాయాబజార్, మాయల మరాఠీ, భక్తప్రహ్లాద నాటకాల ప్రదర్శనలతో వేడుకలు శుక్రవారం రాత్రి ముగిశాయి.దశాబ్దాల క్రితం కడపలో సురభి ప్రాంతంలో ఆవిర్భవించిన కళాకారులు నేటికీ కుటుంబ సమేతంగా తమ జీవితాలను నాటక కళకు త్యాగం చేయడం అందరికీ స్ఫూర్తినిచ్చే విషయమని తెలిపారు. శ్రీవిజయభారతి నాట్యమండలి-సురభి స్వర్ణోత్సవ ముగింపు వేడుకలకు ఆయన హాజరైన ప్రవీణ్ కళాకారులను ఘనంగా సత్కరించి, వారికి నర్రా ఫౌండేషన్ తరపున ఆర్థిక తోడ్పాటునందించారు. త్వరలో ప్రభుత్వం పేదలకు కల్పించబోతున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన కళాకారులకు కేటాయించడంతో కళలను బతికించున్న వాళ్ళమవుతామని అన్నారు. ఈ సందర్భంగా 'నాటకాలకు తరలిరండి' అనే నినాదాన్ని యువత అందుకోవాలని కాంక్షించారు. .ఈముగింపు ఉత్సవంలో శ్రీవిజయభారతి నాట్య మండలి అధ్యక్షులు లేఖజ్, కార్యదర్శి వి.ఉపేందర్, వారి నాటక బృందం, అనంతుడు ఫౌండేషన్ చైర్మెన్ మోత్కూరు శ్రీనివాస్, నర్రా ఫౌండేషన్ సెక్రెటరీ నర్రా వేణుగోపాల్ రెడ్డి, రాంరెడ్డి, రిటైర్డ్ టీచర్ పుష్పగిరి, బూరుగు గోపీకృష్ణ , పల్లె సతీష్, సూర్యాపేట నెమ్మికల్ ప్రాంత కళాభిమానులు, నార్కట్ పల్లి కళారాధకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను సాకని కొడుకులపై చర్యలు తీసుకుంటాం

- మానవత్వం చాటిన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

నవతెలంగాణ-మిర్యాలగూడ



వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ చూసుకోక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ హెచ్చరించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామపంచాయతీ పరిధిలోని పార్తు నాయక్ తండాకు చెందిన ధనవత్ మాల్యా తన ఐదుగురు కుమారులు తనను పోషించడం లేదని చెప్పేందుకు వచ్చాడు. అతన్ని చూసిన సబ్ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనకున్న 6 ఎకరాల వ్యవసాయ భూమిని కొడుకులు పంచుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని, తన భార్య ఏడాది క్రితం చనిపోయిందని తెలిపారు. అప్పటి నుంచి తన పోషణ చూసుకోవడం లేదని గతంలో ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పటి ఆర్డీఓ తన పోషణకు ప్రతి కొడుకు నెలకు రూ.1500 ఇవ్వాలని ఆదేశించారని అయిన ఇప్పటి వరకు పోషణ భత్యం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటి వరకు 9 సార్లు ఆఫీస్‌కు రావటం పై సబ్ కలెక్టర్ స్పందించారు. పోషణ భత్యం ఇవ్వని కుమారులపై కేసు నమోదు చూసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా నాంపల్లి చంద్రమౌళి

నవతెలంగాణ-నాంపల్లి



సీపీఐ(ఎం) నాంపల్లి మండల కార్యదర్శిగా నాంపల్లి చంద్రమౌళిని పార్టీ 8వ మహాసభలోఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సభ్యులుగా వాషిపాక ముత్తిలింగం, కొమ్ము లక్ష్మయ్య, నాంపల్లి రమణ, పల్లెటి వెంకటయ్య, కోమ్ము ముఖేష్, గడ్డం ఎల్లేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ మహా సభలో ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేసినట్టు తెలిపారు. పేద ప్రజల సమస్యల కోసం ఇండ్లు, ఇండ్ల స్థలాలు పెన్షన్స్, రేషన్ కార్డులు మండలంలో ఉన్నటువంటి కిష్టరాయన్ పల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు తక్షణమే అధిక నిధులు కేటాయించి డీపీఆర్ ఆమోదం తీసుకొని పర్యావరణ అనుమతులు ఇవ్వాలని , అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని ,మహిళలపై జరుగుతున్న లైంగికదాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని , చేతివృత్తి దారులని ఆదుకోవాలని తీర్మానాలు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, చిన్నపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్లో అండర్‌పాసెస్ నిర్మాణ పనులు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో అండర్‌పాసెస్ నిర్మాణ పనులను శనివారం చేపట్టారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం మూడు గంటల వరకు అండర్ పాస్ నిర్మాణం యంత్రాలతో చేపట్టారు. దీంతో రేపల్లె రైలుకు రెండు గంటల ఆలస్యంగా వెళ్ళింది. సాయంత్రానికి అండర్పాస్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. సాయంత్రం నుంచి రైళ్లు యథావిధిగా నడిచాయి.

గ్రామాలభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నాం : ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోతే



గ్రామాలాభివృద్ధికి అధిక నిధులు కేటాయి స్తున్నామని ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి అన్నారు బుధ వారం మండల పరిధిలోని ఉర్లుగొండ, హుషాన బాద బిక్య తండ, రాఘవపురం నామవరం గ్రామాలలో అంగన్వాడి భవనాలకు బిటి రోడ్లకు గ్రామపంచాయతీ భవనానికి 46 కోట్ల 30 లక్షల నిధులతో పనులకు శంకుస్థాపన చేశారు. ఉర్లుగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతి నాగలింగేశ్వర స్వామి విగ్ర ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి మండల అధ్యక్షుడు కీసర సంతోషి రెడ్డి ఎంపీపీ ముప్పాని ఆశ శ్రీకాంత్ రెడ్డి జెడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు ఎంపీడీవో ఆంజనేయులు తాసిల్దార్ సంఘమిత్ర డి ఈ హర్ష నాయకులు మైనంపాటి గురువారెడ్డి సామ వెంకట్ రెడ్డి బొడ్డు సాలయ్య బి నాగమల్లయ్య కోల లింగయ్య కారింగుల లింగమూర్తి రమణ శ్రీనివాస్ గోపాల్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-తిరుమలగిరి



ఈ నెల 29,30 డిసెంబర్ 1న జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ తిరుమలగిరి మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయ్య పిలుపునిచ్చారు.శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు.. మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయ్య మాట్లాడుతూ జిల్లా మహాసభ లకు జనసమీకరణ చేయాలని, ప్రతి గ్రామము నుండి జన సమీకరణ కావాలని కోరారు. అనంతరంమహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు.
ఈ కార్యక్రమంలో జీఎంపిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య, మండల కమిటీ సభ్యులు కడారి లింగయ్య, మిట్టపల్లి లక్ష్మి, చిత్తలూరి సోమయ్య, వనం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమానత్వాన్ని హరించి వేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం

- రాష్ట్రంలో ప్రజలు ఆశించినంతగా లేని కాంగ్రెస్ పరిపాలన
- ప్రజల పక్షాన నిలబడి పాలకులను ప్రశ్నించేది ఎర్రజెండానే
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి.

నవతెలంగాణ-సూర్యాపేట



రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ కలిగిన సమాన హక్కులను, సమాన విలువలను, సమానత్వాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం హరించి వేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు.శనివారం స్థానిక ఎంవీఎన్ భవన్లో జరిగిన ఆ పార్టీ టూ టౌన్ మహాసభలో ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య వైశామ్యాలు సృష్టిస్తూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన సమానత్వాన్ని హరించి వేస్తుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడులు పెరిగాయని పేర్కొన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకుంటున్న బీజేపీ ప్రజల సంపదను దోచి సంపన్నులకు కట్టబెడుతుందని విమర్శించారు.ప్రజల సంపదను దోచుకునే వారిని ఎదిరించి ప్రజల పక్షాన పోరాటం చేసేది ఎర్రజెండా తప్ప మరో జెండా లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశించిన విధంగా పరిపాలన చేయడం లేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఉచిత బస్సు మినహా ఏ పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రైతాంగానికి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ సక్రమంగా అమలు చేయలేదని పేర్కొన్నారు. రుణమాఫీ కోసం 30 వేల కోట్లు ఇస్తామని ప్రకటించి 18000 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. రైతులు పండించిన పంటకు బోనస్ ప్రకటిస్తామని చెప్పి మాట తప్పి సన్న వడ్లకు మాత్రమే బోనసిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ఇస్తానన్న 2500 ఎప్పుడు ఇస్తారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో స్కీం వర్కర్ల వేతనాలు పెంచాలని పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో జాప్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాలలో ప్రజలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పట్టణ ప్రాంత పేదలకు ఇల్లు ,ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డు లేక సంక్షేమ పథకాలు సక్రమంగా పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా, వైద్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపించి అందరికీ అందుబాటులోకి తేవాలని పిలుపునిచ్చారు. నయా పైసా ఖర్చు లేకుండా పేదలందరికీ మెరుగైన వైద్యాన్ని అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా అందరికీ విద్య, ఇండ్లు, ఇళ్ల స్థలాలు ,పెన్షన్స్ వంటి పథకాలను రాష్ట్రస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు, ప్రజల సమస్యలపై నికరంగా పోరాటాలు నిర్వహించేది ఎర్రజెండా తప్ప మరో పార్టీ లేదన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభ సూచికగా ఎర్రజెండాను సీనియర్ నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. అనంతరం టూ టౌన్ కమిటీ సభ్యులు బోళ్ల వెంకటరెడ్డి, పిండిగ నాగమణిల అధ్యక్ష వర్గంగా జరిగిన ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు,కొలిశెట్టి యాదగిరిరావు,కోట గోపి,మట్టి పెళ్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల రజిత, టూ టౌన్ కార్యదర్శి బత్తుల వెంకన్న, టౌన్ కమిటీ సభ్యులు ఉయ్యాల నగేష్,మోకర్ల వెంకన్న, మండల్ రెడ్డి వెంకట్ రెడ్డి,కామ్రేడ్ శ్రీనివాస్,కోట సృజన, నాయకులు బోళ్ల సోమిరెడ్డి, ఇరుగు వెంకటయ్య,జహీర్ సాబ్, హఫీజ్ బాబు,చిత్రం భద్రమ్మ,సురేష్, రమణ, శంబయ తదితరులు పాల్గొన్నారు.

నేడు ,రేపు గ్రూప్ -3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



నేడు రేపు జరగనున్న గ్రూప్ -3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు ఉదయం 7:00 గం? లకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. జిల్లాలో 50 పరీక్ష కేంద్రాలలో 16,543 మంది అభ్యర్థులు హాజరు కారు ఉన్నారని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ 19, జాయింట్ రూట్ ఆఫీసర్స్ 10, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ 54, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్ 208, పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే అభ్యర్థులు టీజీపీఎస్సీ నిబంధనలను పాటించాలని తెలిపారు. 17వ తేదీ ఉదయం మధ్యాహ్నం పరీక్ష ఉంటుందని ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల నుండి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకి అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 9:30 మధ్యాహ్నం 2:30 గంటల సమయం దాటితే అభ్యర్థుల పరీక్ష కేంద్రానికి అనుమతించరని, గేట్లు మూసివేయాలని తెలిపారు. 18వ తేదీ పరీక్షకు 8:30 నుండి పరీక్షా కేంద్రాలకి అభ్యర్థులను అనుమతిస్తారని 9:30 గంటల తదుపరి గేట్లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులకు బయటకు పంపొద్దు అని తెలిపారు అభ్యర్థులు బయోమెట్రిక్ హాజరు ఇవ్వాలని సూచించారు పరీక్షా కేంద్రాల్లోని అభ్యర్థులను నిషిత పరిశీలన తదుపరి అనుమతించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

తండ్రి వారసత్వ భూమిపై హక్కు కల్పించాలని కోరుతూ కూతుళ్ల నిరసన

- భూమి కోర్టు పరిధిలో ఉన్న రిజిస్ట్రేషన్ చేసిన వైనం
- రిజిస్ట్రేషన్ చేయొద్దని ముందుగానే తహసీల్దార్ కోరిన కూతుర్లు

నవతెలంగాణ-తుంగతుర్తి

తండ్రి వారసత్వ భూమిపై బిడ్డలకు హక్కు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ కూతుర్లు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన అన్నపర్తి ముత్తయ్యకు ఊరు చివరలో సర్వేనెంబర్ 29, 30 ఇ లలో సుమారు 1.22 ఎకరాల పట్టా భూమి ఉన్నది. ఇతనికి ఇద్దరూ భార్యలు. మొదటి భార్యకు అయిదుగురు సంతానం,రెండవ భార్య నాగమ్మకు ఇరువురు కుమార్తెలు ఉన్నారు.నాగమ్మ కుమార్తెల పెళ్లి కూడా మొదటి భార్య 5 గురు అక్కలు కలిసి వీరి వివాహం చేశారు. రెండు నెలల క్రితం ముత్తయ్య తన భూమిని ఎవరికి చెప్పకుండా, మరొకరికి అమ్మినట్లు రిజిస్ట్రేషన్ చేయించాడని కుమార్తెలు తెలిపారు.తుంగతుర్తి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయకముందే మొదటి భార్య ఐదుగురు బిడ్డలు కలిసి రిజిస్ట్రేషన్ చేయొద్దని తహసీల్దార్ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దీనికి తోడు బిడ్డలు భూమిపై కోర్టులో కేసు కూడా వేయించారు. అయినప్పటికీ తహసీల్దార్ దయానంద్ ఆ భూమిని బానోతు భూమిక పేరిట రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు. తండ్రి ముత్తయ్య వారసత్వ భూమిపై తమకు హక్కు కల్పించాలని, అక్రమ రిజిస్ట్రేషన్ పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని ముత్తయ్య కుమార్తెలైన వడకల లక్ష్మీ, సైదమ్మ మరియమ్మ, మల్లమ్మ నాగమ్మ కుటుంబ సభ్యులు కోరారు.

భారీగా పెరిగిన డీఏపీ ధరలు

- ఒక్కొక్క బస్తాకు రూ.300 పెంపు మండల రైతులపై రూ.కోటి పైనే భారం

నవతెలంగాణ-మునగాల



భారీగా డీఏపీ ధరలు పెరగటంతో రైతులు దిగులు చెందుతున్నారు. 50కిలోల బస్తాపై ఏకంగా రూ. 300 ధరలు పెరిగాయి.ఈ నెల 14న ధరలు పెరిగినట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.గతంలో రూ.1350గా ఉన్న డీఏపీ ప్రస్తుతం రూ.1650 పెరిగిపోయింది. వరి పంటలు సాగుకు ఎకరానికి 75 కిలోల నుంచి వంద కిలోల వరకు రైతులు దమ్ములో డీఏపీని చల్లుతున్నారు.దీంతో ప్రతి ఎకరానికి 450 నుంచి 600 వరకు రైతుకు భారం కానుంది.రసాయన ఎరువులపైనే ఆధార పడి రైతాంగం వ్యవసాయం చేస్తున్నారు.డీఏపీలో వుండేది భాస్వరం.ఇది పంటలకు పోషకాలందించి దిగుబడులు పెంచేందుకు దోహదపడుతుంది. గ్రామీణప్రాంతాల్లో పశువులు పెంపకం బాగా తగ్గిపోయింది.20 ఏండ్ల కిందటి వరకు రైతులు ఎద్దులతో వ్యవసాయం చేసేవారు.ప్రతి రైతు ఇంటిలోనూ పాడి గేదెలు వుండేవి.వాటి నుండి వచ్చే (పేడ) ఎరువును పంటపొలాల్లో సేంద్రీయ ఎరువుగాఉపయో గించేవారు.కాలానుగుణంగా వ్యవసాయంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వ్యవ సాయంలో యాంత్రీకరణ ప్రారంభమైంది.ఇక రైతులకు అరక ఎద్దులతో అక్కర లేకుండా పోయింది. ఇక పశు పోషణను పక్కకు పెట్టారు. దీంతో పశువుల పెంట కొరత ఏర్పడింది. ఫలితంగా రైతాంగం మొత్తానికి మొత్తంగా రసాయన ఎరువులకు అలవాటు పడ్డారు.డీఏపీ ఎరువు వాడకపోతే పంట దుబ్బురాదని రైతులు పేర్కొంటున్నారు.పంటల్లో వినియోగించే ప్రధాన ఎరువుధరను ఇలా పెంచడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.వరిపంటకు సరైన మోతాదులో భాస్వరం అందించకపోతే పంటల దిగుబడులు తగ్గిపోతాయని రైతులు పేర్కొంటున్నారు. రైతులకు పెట్టుబడి వ్యయం బాగా పెరిగిపోయింది. వరిపంటల సాగుకు ఎకరానికి సుమారు 30 వేలకు పైగానే ఖర్చులు అవుతున్నాయి.అన్నింటికి మించి సస్యరక్షణ ఖర్చే తడిసి మోపడవుతున్నాయి.పెరిగిన ధరలకనుగుణంగా గిట్టుబాటు ధరలు రాక అప్పు లుపాలౌతున్నారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, కూలీల రేట్లు, ఏటేటా పెరిగి పోతున్నాయి. రైతు పండించిన పంటలకు మాత్రం ధరలు రావటం లేదు. దీంతో రైతుకు వ్యవసాయం రాను రాను భారంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులుకు అండగా వుంటామని హామీలిస్తున్నా అవి ఆచరణలో అమలుకు నోచుకోని పరిస్థితి వుంది.ఎరువుల కంపెనీలు రూ.వందలకు వందలు ధరలు పెంచుకుపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

మండల రైతులకు కోటి పైనే భారం

మండలంలో ఈ వానాకాలంలో 30606 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు.వ్య వసాయ అధికారులు అందించిన సమాచారం మేరకు వరి 21118 పప్పులు 502.మసాలా దినుసు లు 352. పండ్ల తోటలు 1048. కూరగాయలు1063.పత్తి 6906. నూనె గింజలు 236. కలప 117. పచ్చి ఎరువుల పంటలు. 294 గా రైతులు సాగు చేశారు.అపరాల పంటల సాగు అటుంచితే ఈ వేసింగిలో కూడా సుమారు 20వేల ఎకరాల వరకు వరి పంటలు సాగయ్యే అవకాశం వుంది.పెరిగిన ధరలకుఅనుగుణంగా ఒక్కో ఎకరానికి రూ.450నుంచి రూ.600చొప్పున మొత్తం 20 వేల ఎకరాలకు రూ. 90 లక్షల నుంచి1కోటి 20 లక్షల వరకు రైతులపై భారం పడనుంది.పెరిగిన ధరలు వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.ఈ ధరలు తమకు తలకు మించి న భారం కానున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెరిగిన ధరలను నియంత్రించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన ధరలతో రూ.10 వేల భారం



సర్రా ప్రమోద్‌రెడ్డి, ముకుందాపురం

నాకు పదెకరాల భూమి వుంది.అందులో వానాకాలం వేసింగి రెండు సీజన్లలోనూ వరిపంట సాగు చేస్తా.పెరిగిన డీఏపీ ధరలకారణంగా ఏడాదికి రూ.10వేల భారం పడనుంది. రైతులపై ఎరువుల భారం మోపడం సరికాదు.

అయ్యప్ప మాలధారణ స్వాములకు అన్న ప్రసాద సమర్పణ



నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల మండలంలోని కల్లూరు గ్రామంలో ఎంతో నిష్టతో నియమ నిబం నిబంధనలతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలదరించిన స్వాములకు కార్తీక మాసం శనివారం సందర్భంగా హుజూర్నగర్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వరరావు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కార్తీక మాస సమయంలో చతుర్మాస దీక్షలో ఉంటారని, కార్తీక మాసం అంటే భారతదేశం అంతా భక్తిశ్రద్ధలతో ప్రజలు పూజలలో పాల్గొంటారని, ఈ కార్తీకమాసంలోనే అయ్యప్ప స్వాములు మాల ధరించి అయ్యప్ప స్వామిని స్మరిస్తు దీక్ష చేపడతారని అయ్యప్ప స్వామి దీక్ష ఎంతో పవిత్రమైనది కఠినమైనదని అయ్యప్ప స్వామి మాల వేసుకున్న ప్రతి ఒక్కర్ని నమస్కరిస్తూ, ఈ దీక్ష చేపట్టిన వారు భక్తిశ్రద్ధలతో , ఎదుటి వారి పై గౌరవంతో మెలుగుతారని దీక్ష ఎంతో విశ్వసనీయమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజి,కల్లూరు గ్రామంలోని అయ్యప్ప స్వాములు గుడుగుంట్ల బిక్షం, అ నంతు నాగరాజు బుడిగే మట్టయ్య, మేకపోతుల గోపి, రమేష్, వీరాస్వామి అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

- అభ్యర్థులు గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-సూర్యాపేట



ఆదివారం, సోమవారం రెండు రోజులు పాటు జరిగే గ్రూప్-3 రాత పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ట భద్రతా, బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణంలో 30, కోదాడ పట్టణంలో 20 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టు పక్కల లౌడ్ స్పీకర్లు మూసి వేయాలని కోరారు. పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుంపులుగా చెరవద్దని సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌లో పొందు పరిచిన విధంగా సమ యానికి చేరుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమవెంట పరీక్షా హాల్ లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలి క్యులేటర్లు, వాలెట్లు వంటివి తీసుకువెళ్లడానికి అనుమతి లేదని తెలిపారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వాహనాలు వేగంగా నడపవద్దని సూచించారు. ముందుగా బయలుదేరి ఎలాంటి వత్తిడి లేకుండా పరీక్షా వ్రాయాలని అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఐ(ఎం) బహిరంగ సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ- హుజూర్‌నగర్‌టౌన్

ఈ నెల 29న సూర్యాపేటలో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం కోరారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన మహాసభలలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విధానాలు, ప్రజా సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోరాటాల రూపకల్పన జరిగిందన్నారు. మహాసభ లఅనంతరం నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజల తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటేష్ నాయక్, దుగ్గి వేణు, సైదమ్మ, శేఖర్, సావిత్రమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని వినతి

నవతెలంగాణ-మఠంపల్లి

ధాన్యం కొనుగోళ్లను వేగవంత ంచేయాలని, ఐకేపీకేంద్రాలు ప్రా రంభమై 20 రోజులు అవుతున్నా నేటికీ ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బ ందులు పడుతున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాం డునాయక్, మండల కార్యదర్శి మాలోత్ బాలునాయక్ అన్నారు.ఈ విషయమై శనివారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలుచేసి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు.వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కె.వెంకటరెడ్డి, పొడిచెట్టి రాము, ఎం. రాజు, మట్టయ్య,రావిరాల శ్రీను ఉన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పై కేసు నమోదు

నవతెలంగాణ-తుంగతుర్తి

మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తుంగతుర్తి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. శనివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న గుగులోత్ యువరాజును కొట్టాడని అతని తండ్రి గుగులోతు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కూడా పాఠశాలలో విద్యార్థులపై చేయి చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకోవాలి

నవతెలంగాణ-నేరేడుచర్ల



విద్యార్థి దశలోని విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకోవాలని ఐపీఎస్ పి. ధీరజ్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రతి విద్యాలయం ఇంగ్లీష్ మీడియం నందు పిల్లలకు చదువు పట్ల ఏకగ్రత పెంచుట మరియు భవిష్యత్తులో ఇలాంటి కోర్సులు తీసుకోవాలి అనే అంశాలను దృష్టిలో ఉంచుకొని సివిల్ సర్వీసులు టాపర్ గా నిలిచి ఐపీఎస్ సాధించిన పి. ధీరజ్‌రెడ్డితో శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పలు సందేహాలకు సమాధానాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు నీ ఇష్టమైన లక్ష్యం ఎంచుకొని దానిని సంపాదించడానికి కృషి చేయాలన్నారు. సమాజ సేవ పై తనకు ఉన్న మక్కువతో సివిల్ సర్వీస్ కి ఎంచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొప్పుల రంగారెడ్డి మరియు ప్రధానోపాధ్యాయులు కొప్పుల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషి చేస్తూ సమాజసేవ పట్ల కూడా ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నేరేడుచర్ల

ఈనెల 29, 30 డిసెంబర్ 1 తేదీల్లో జరిగే సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి సిరికొండ శ్రీను కోరారు. శనివారం మండలంలోని పెంచికల్ దిన్న గ్రామంలోని హరి బండి ఓంకార్ భవన్ వద్ద జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ ఈనెల 29న సూర్యాపేటలో భారీ బహిరంగ సభ జరగనుందని ఇట్టి బహిరంగ సభకు కేంద్ర నాయకత్వం హాజరవుతున్నందున ఈ ప్రాంత రైతులు రైతు కూలీలు కార్మికులు కర్షకులు మేధావులు సబ్బండ వర్గాల ప్రజలు హాజరై బహిరంగం సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మరి నాగేశ్వరరావు గ్రామ శాఖ కార్యదర్శి అల్వాల శ్రీధర్ పాలకూరి రాములమ్మ అరి బండి ప్రసాద్ రావు ఎల్లబోయిన గంగమ్మ చావ సీతారాములు పగిడి వీరయ్య పెండెం సైదులు కుక్కల రామారావు సిరికొండ ప్రసాద్ పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న శ్రీనివాసరావు

నవతెలంగాణ-చిలుకూరు



దాతృత్వం శ్రీనివాసరావు చాటుకున్నాడని చిలుకూరు మండల ఏఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని నారా యణపురం గ్రామంలో వరి కోత మిషన్ డ్రైవర్గా పనిచేస్తున్న జనోతు రవి హుజూర్‌నగర్‌కు వెళ్తూ సీతారాంపురం స్టేజి వద్ద తన పర్సును పోగొట్టుకున్నాడు.25 సంవత్సరాలుగా మండలకేంద్రంలో పేపర్ ఏజెంట్‌గా పనిచేస్తున్న కందుకూరి శ్రీనివాసరావుకు పర్సు దొరకడంతో పర్స్ ఓపెన్ చేసి చూడగా దాంట్లో ఉన్న అడ్రస్ ప్రకారం చిలుకూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ఇవ్వగా వెంటనే బాధితుడుని పిలిచి అందించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్సులో 6000 ఏటీఎం కార్డులు,ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు ఉండడంతో శ్రీనివాసరావు తన దాతృత్వాన్ని చాటుకున్నాడని పోలీసులు అభినందించారు.

నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, సీనియర్ నాయకుడు ఎం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన మాట్లాడారు.అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు బురద జల్లుకొని విమర్శించుకోవడమే తప్ప ఆచరణలో ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెట్టుబడుదారులకు అండగా ఉంటూ వారికి మద్దతిస్తూ పేదల సంక్షేమ పథకాలను తగ్గిస్తుందని విమర్శించారు కమ్యూనిస్టు పార్టీలే నిరంతరం ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తూ పోరాటం చేస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవరం మల్లేశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, ఎల్లావుల రమేశ్, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీను, జక్కుల రమేష్, మామిడి వెంకయ్య పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

నవతెలంగాణ-చిలుకూరు

దాతల సహకారం మరువలేనటువంటిదని చిలుకూరు మండల ఎంఈఓ గురవయ్య అన్నారు.శనివారం మండలంలోని బేతవోల్ గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు బేతవోలు గ్రామానికి చెందిన కీర్తిశేషులు కంచర్ల రాములు గారి జ్ఞాపకార్థం కుమారుడు కంచర్ల సత్యబాబు రూ.15 వేల విలువ కలిగిన సౌండ్ బాక్సులు మైక్‌స్టాండ్ పోడియంను పాఠశాలకు దాతగా అందించారు. అనంతరం కంచర్ల సత్యబాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలలో 10/10 సాధించిన విద్యార్థిని విద్యార్థులకు రూ.10,000 బహుమతిగా అందిస్తానని తెలిపారు.పాఠశాల యజమాన్యం సత్యబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు చందా శ్రీనివాసరావు, కోటేశ్వర్‌రావు, వీరబాబు, శౌరివెంకన్న, ఉపేందర్, శ్రీరామ్, కృష్ణ, ప్రకాశం వెంకటేశ్వర్లు, నంసింహారావు, ఆర్‌పి లాలు, ఓఎస్ రాజ్యం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్రపై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-కోదాడరూరల్

అనంతగిరి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నవంబర్ 16న జాతీయ పత్రిక దినోత్సవ పుర స్కరించుకొని సమాజంలో జర్నలిస్టుల పాత్ర అనే అంశంపై హై స్కూల్ విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహిం చనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గరిడేపల్లి మురళి శనివారం ఒక ప్రకటనలో ప్రకటనలో తెలిపారు. అనంతగిరి మండల వనరుల కార్యాలయంలో మండల పరిధిలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఈ వ్యాస రచన పోటీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యాసరచనలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులతో పాటు నగదును కూడా అందజేస్తామన్నారు. ప్రతి సంవత్సరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి వ్యాసరచన కా ర్యక్రమాలు కొనసాగుతాయని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు వ్యాసరచన పోటీలు దోహదం

నవతెలంగాణ-తుంగతుర్తి



విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసే ందుకు వ్యాసరచన పోటీలు దోహదపడతాయని దాయం రాజిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ గ్రంథాలయ చైర్మెన్ దాయం ఝాన్సీ రాజిరెడ్డి అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా దాయం రాజిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, ప్రధానో పాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ యాకయ్య, పాఠశాల ఉపాధ్యాయులు రాజన్న, నవీన్ ప్రసాద్, శ్రీనివాస్, రాజు, సునీత, రవికుమార్ బాబు, సామాజిక ఉద్యమ కార్యకర్త మల్లేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సంగిశెట్టి సాయిబాబు

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సంగిశెట్టి సాయిబాబును తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్‌కుమార్ ఈ మేరకు నియామకపత్రాన్ని శనివారం హైదరాబాదులో అందజేశారు.ఈసందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల, చేనేత వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం నా వంతు కర్తవ్యాల నిర్వహిస్తానని తెలిపారు.నా ఎన్నికకు రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్, రాష్ట్ర నాయకులు వేముల బాలరాజు, గంజి శ్రీనివాసులు, మచ్చ సుధాకర్, సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు చిరందాసు ధనుంజయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ లక్ష్యం

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన మూసీ నిద్ర కార్యక్రమం అభివృద్ధి అడ్డుకోవడమేనని పేర్కొన్నారు.మంత్రికి చిత్తశుద్ధి ఉంటే మూసీ ప్రజాకప్రాంతంలో నిద్రించి వారితో భోజనం చేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వస్తే పొరపాటు లేదన్నారు. ప్రధాని మోడీ సబర్మతి రివర్ ఫ్రంట్, గంగ రివర్ ఫంటూ ప్రక్షాళన చేసినప్పుడు మేము సహకరించిన విధంగానే మూసీ ప్రక్షాళనకు సహకరించాలని కోరారు.దక్షిణ భారతదేశాన్ని ముఖ్యంగా తెలంగాణరాష్ట్రాన్ని గుజరాత్ మోడల్ కంటే అధిక అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని, దీనికి రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు.ప్రజలు మీకు ఓట్లేసి గెలిపించారని, వారి అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు.

విద్య,వైద్యం,ఉపాధి,భూమి,ఇండ్లు కోసం ధర్మయుద్ధం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు అన్నగారిన, పేద ప్రజలైన బీసీ,ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన వైద్యం అందించి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం చేయబోతుందని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ అన్నారు.శనివారం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని రహదారి బంగ్లాలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య,వైద్యం,ఉపాది,భూమి,ఇండ్లు ఈ ఐదు గ్యారంటీలను ప్రజలకు అందించే వరకు ఈ రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడతామని తెలిపారు.కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో ప్రజల సామాజిక, ఆర్థికపరిస్థితుల్లో ఎలాంటి మార్పు ఉండదన్నారు.విద్య,వైద్యం,ఉపాధి,భూమి,ఇల్లు ఈ ఐదు గ్యారంటీలతో పేద ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పర్చవచ్చన్నారు.ఈ గ్యారంటీలను ప్రజలకు అందించే వరకు ధర్మ సమాజ్ పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు.ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య,వైద్యం అందించాలని, ఉపాధికల్పించాలని కోరుతూ ఈ నెల 18న కలెక్టర్‌కి రిప్రెసెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు అశోక్‌యాదవ్, శ్రీకాంత్ మహారాజ్, శివమహారాజ్, నర్సింగ్‌మహారాజ్, శివ పాల్గొన్నారు.

అలవి గాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్నరాజ్

నవతెలంగాణ-రామన్నపేట

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అలవి గాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్నరాజు విమర్శించారు.శనివారం స్థానిక రహదారి బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, రెండు లక్షల రుణమాఫీ సరిగ్గా అమలు చేయలేదని, మహిళలకు నెలకు 2500 భరోసా, రైతు భరోసా, ఆసరా పింఛన్ల పెంపు, కళ్యాణ లక్ష్మి, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి విస్మరించారని ఆయన విస్మరించారు. అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో విఫలమైదన్నారు. మూసీసుందరీకరణ పేరుతో నోటీసులివ్వకుండా బుల్డోజర్లతో పేద ప్రజల ఇండ్లు కూల్చివేయడం దారుణమన్నారు.ప్రజాభిప్రాయం, డీపీఆర్ లేకుండానే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారాన్నారు.రూ.1,50,000 కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కార్పోరేట్ శక్తులకు అప్పగించడం కోసమే మూసీ సుందరీకరణ చేపడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పాలన చేస్తుందని, రాహుల్‌గాంధీ ఒక మాట చెబుతున్నారని, ఆచరణలో అది వేరేలా ఉంటుందన్నారు.వ్యక్తిగత దూషణలతోనే ప్రభుత్వం కాలం వెల్లదీస్తుందని, డైవర్ట్ పాలసీ అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు వ్యతిరేకంగా పాలన చేస్తే ఏ ప్రభుత్వానికైనా అధోగతి పడుతుందని తెలిపారు.



పరామర్శ

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణానికి చెందిన వల్లపు క్రాంతి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో అనారోగ్యం కారణంగా అపెండెక్స్ ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతుండగా శనివారం తెలంగాణ వడ్డెరసంఘం,అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తరి గణేష్ పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ధైర్యంగాఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వల్లెపుఉప్పలయ్య, దండుగుల శివరంజన్,దండుగల నిరంజన్,దండుగల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాదమ్మ దశదినకర్మలో..మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆత్మకూరుఎం

మండలకేంద్రానికి చెందిన వ్యాపారవేత్త తొర్ర విష్ణు తల్లి తొర్ర యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది.కాగా శనివారం యాదమ్మ దశదినకర్మ కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ యాదమ్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.యాదమ్మ కుమారులు విష్ణు, రాము, శ్రీనులను పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు బీసు చందర్‌గౌడ్,ఆ పార్టీ జిల్లా నాయకులు కోరె భిక్షపతి, పార్టీ గ్రామ అధ్యక్షులు కోరే వెంకన్న, సీపీఐ(ఎం) డివిజన్ నాయకులు రచ్చ గోవర్ధన్,టౌన్ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య ఉపాధ్యాయులు పంజాలనర్సయ్య, అశోక్‌రెడ్డి, ఐలయ్య, యాసిన్,విష్ణు, నాయకులు గర్దాస్‌లింగయ్య విజయ్ పాల్గొన్నారు.

చాముండేశ్వరాలయంలో జ్వాలాతోరణం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని, శ్రీ చాముండేశ్వరి ఆలయంలో జ్వాలాతోరణం రంగ వైభవంగా భక్తుల సమక్షంలో, ఆలయ అర్చకులు ములకల రఘు ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. ఆలయం చుట్టూ జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకు ముందు రుద్రాభిషేకం, నిర్వహించారు. జ్వాలా తోరణం అనంతరం పార్వతీ పరమే శ్వరుల విగ్రహాలతో దేవతా మూర్తులను, కావడిపై పల్లకి సేవఊరేగింపుతో గోదాదేవి లక్ష్మీదేవి సీతా రంగనాయక ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం,బొడ్రాయి మీదుగా మేళతాళాలు, వాయిద్యాలతో భక్తులతో కలిసి ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ములకల రఘు,పట్టణంలోని మహిళలు, యువకులు, చాముండేశ్వరి దేవాలయం కాలనీవాసులు పాల్గొన్నారు.



19న శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ఈనెల 19వ తేదీన పట్టణ పరిధిలోని శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవత కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మెన్ తోటకూర వెంకటేశ్‌యాదవ్ తెలిపారు. శనివారం ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ ఈనెల 18వ సోమవారం మహాగణపతి పూజతో అమ్మవారి కల్యాణం ప్రారంభమవుతుందన్నారు.19వ తేదీన అమ్మవారి కల్యాణం, 20వ తేదీన మారుమూలం కార్యక్రమంతో కల్యాణ వేదిక ముగుస్తుందని తెలిపారు.

చౌటుప్పల్‌లో శ్రీ కంఠమహేశ్వరస్వామి బోనాలు

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని గౌడసంఘం ఆధ్వర్యంలో శ్రీ సూరమాంబ కంఠమహేశ్వరస్వామి బోనాలను శనివారం గౌడకులస్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఆటపాటలు, శివసత్తుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో, పోతరాజుల విన్యాసాలతో గ్రామ పురవీధులగుండా ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.గౌడ కులస్తులు ఎమ్మెల్యేను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



యువత గంజాయి బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ హనుమంతరావు

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

యువత, విద్యార్థులు గంజాయి బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మినీ మీటింగ్‌హాల్‌లో గంజాయిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్‌చంద్ర, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్, రెవెన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి లు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, జిల్లాను గంజాయిరహిత జిల్లాగా మార్చాలన్నారు. గంజాయి మీద దృష్టి పెట్టి, యువతను, విద్యార్థులను గంజాయి, ఇతర మత్తుపదార్థాల నుండి కాపాడాలన్నారు.యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అమ్మే కేంద్రాల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లా అంతటా నిఘా పెట్టి, కొనే వాళ్ళు లేకుంటే అమ్మే వాళ్ళను గుర్తిస్తే నియంత్రణ చేయొచ్చు అన్నారు. యువతకు వాటి వల్ల కలిగే నష్టాలపై వివరించాలని, ఎక్కువగా పాఠశాలలు, కళాశాలలు ఉన్న చోట నష్టాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలన్నారు.జిల్లాకు సరిహద్దు రాష్ట్రాల నుండి గంజాయి పదార్థాలు రాకుండా అన్ని చెక్‌పోస్టులలో గట్టి నిఘా పెంచి పటిష్ఠ చర్యలు చేపట్టాలని, జిల్లాలో గంజాయి పంట సాగు గుర్తించి ధ్వంసం చేసి కేసులను నమోదు చేయాలని పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులకు సూచించారు. తల్లిదండ్రులు రోజువారి పిల్లల స్థితిగతులను పరిశీలన చేయాలని కోరారు.పాత నేరస్థులపై ప్రత్యేకనిఘా పెట్టాలన్నారు.రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘాపెట్టి మూలాలతో సహా గంజాయి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్సైజ్ అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అవసరమైతే భవిష్యత్‌ను నాశనం చేసే గంజాయిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.గుడుంబాపై పోలీస్, ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించి ఉక్కుపాదం మోపాలన్నారు.డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్‌చంద్ర మాట్లడుతూ జిల్లాఅంతటా గట్టి నిఘా ఉంచామని, జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నామని, అలాగే యువతకు కౌన్సిలింగ్ ఇవ్వడం కూడా జరుగుతుందన్నారు.కేసులు కూడా నమోదు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో భువనగిరి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, జిల్లా పంచాయతీ అధికారి సునంద, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





అంజన్న గట్టు ఆలయంలో ప్రత్యేకపూజలు

● ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-తుర్కపల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామ సమీపంలో అంజన్నగట్టు ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వారి కుటుంబ సభ్యులతో కలిసి రామలింగేశ్వర స్వామి వారిని, సాయిబాబను దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.కార్తీక మాసఉత్సవాలలో భాగంగా శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ గజమాలతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మెన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శంకర్‌నాయక్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి,పార్టీ మండల నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూసీపై బీజేపీ నేతల కొత్త డ్రామాలు

● మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకోవడానికి బీఆర్ఎస్‌తో కలిసి కుట్ర

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

మూసీపై బీజేపీ నేతల కొత్త డ్రామాలు మొదలు పెట్టారని రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మండిపడ్డారు.శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ మూసీపునరుజ్జీవ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి బీఆర్ఎస్‌తో కుట్రలు చేస్తున్నారన్నారు. మూసీ బాధితులతో కలిసి ఒక రోజు రాత్రి ఉంటామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనడం సిగ్గుగా ఉందన్నారు.మూసీ మురికిలో అనేక దశాబ్దాలుగా నిరుపేదలు ఉంటున్నారన్నారు.మురికికంపులో దోమల మధ్య రోగాల బారిన పడి విధి లేక ప్రజలు అక్కడే నివాసముంటు న్నారన్నారాని అవేదన వ్యక్తం చేశారు.మూసీకంపులో మూడు నెలలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ నేతలకు ఛాలెంజ్ విసిరారని తెలిపారు.కిషన్‌రెడ్డి మాత్రం ఒక రాత్రి షో చేయడానికి మీడియా ప్రచారం కోసం వెళ్తున్నారని..ఒక రాత్రి ఉండి మీరు ఏం సాధిస్తారని ప్రశ్నించారు.దోమ తెరలు, ఫ్యాన్లు, మాస్కులు లేకుండా ఆరు బయట బీజేపీ నాయకులు నిద్ర పోవాలని చాలెంజ్ విసిరారు.మీడియా కోసమే కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు షో చేస్తున్నారన్నారు.మూసీ బాధితులపైన మీకు ఏ మాత్రం ప్రేమ ఉన్నా మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు కు సహకరించాలన్నారు .మూసి పునర్జీవం కావాలి కాని ఎవరిని అక్కడి నుంచి ఖాళీ చేయించొద్దని కిషన్‌రెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.సబర్మతి , నమామీ గంగే కార్యక్రమాల కోసం అక్కడ ఎవరిని ఖాళీ చేయించలేదా..? అని ప్రశ్నించారు.గుజరాత్ లో 40 వేల కుటుంబాలను తరలించారని, మరెందరికో పునరావాసం కల్పించకుండా మోసం చేసిన ఘనత వారిదే అన్నారు.కిషన్ రెడ్డికి ఏ మాత్రం సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రజలపై ప్రేమ ఉన్నా మూసీ ప్రక్షాళనకు సహకరిం చాలన్నారు. కేంద్రంతో మాట్లాడి మంచి కార్యక్రమానికి నిధులు తీసుకు రావాలన్నారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం నదులను ప్రక్షాళన చేయొచ్చు.. లక్షల మంది ని అక్కడి నుంచి ఖాళీ చేయించ వచ్చు కానీ తెలంగాణలో మాత్రం మూసి ప్రక్షాళన చేయొద్దా..? ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు.కేవలం రాజకీయాల కోసమే బీజేపీ మూసి పైన రాద్ధాంతం చేస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్రను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.మూసీ ప్రక్షాళనకు అడ్డం ఎవరొచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో తుర్కపల్లి కాంగ్రెస్ నాయకులు శంకర్‌నాయక్,చాడ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తల్లి లాంటి భూదేవిని కాపాడాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని హరిత పారిశ్రామిక పార్కులో రమణి డాక్టర్ ప్రసాద్ లు నెలకొల్పిన రమణి బయో కాంపోస్టికా పరిశ్రమను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జూబ్లీహిల్స్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పిల్లలకు ఆస్తుల కంటే ముందు ఆరోగ్యం అనే భాగ్యాన్ని అందించాలని కోరారు. ఈ పరిశ్రమలో మొక్కజొన్న పొట్టు నుంచి సంచులు తయారు చేసే యంత్రాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అరికపూడి గాంధీ మాట్లాడుతూ,నిత్యం ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ మూలంగా ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు.మనం వాడుకొని పారవేసిన ప్లాస్టిక్ సంచులు భూమిలో కరిగేందుకు ఎనిమిది వందల సంవత్సరాలు పడుతుందని, పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని తెలిపారు.ఈ పరిశ్రమలో మొక్కజొన్న పొట్టుతో తయారయ్యే బయోడిగ్రేడబుల్ సంచులు భూమిలో 90 రోజుల్లోనే కరిగిపోతాయని పర్యావరణానికి పశువులకు ఇలాంటి నష్టం జరగదని తెలిపారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అంచలంచలుగా ప్లాస్టిక్ ను గుట్కాను గంజాయిని పూర్తిగా నిషేధించాలని దీనికి యువత నడుం బిగించాలని కోరారు. వ్యాపారం కోసం కాకుండా సమాజానికి తమ వంతు సహాయం చేసేందుకు బయో డేబుల్ సంచుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసిన రమణి డాక్టర్ ప్రసాద్ దంపతులను ఆయన అభినం దించారు. ప్లాస్టిక్ సంచుల వలన ప్రజలకు పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని నివారించేందుకు పర్యావరణ అనుకూలమైన సంచులను మొక్కజొన్న పొట్టు నుంచి తయారు చేసే టెక్నాలజీని కనిపెట్టిన డిఆర్డిఓ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వీర బ్రహ్మంను ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ టెక్నాలజీని డీఆర్డీఏ ద్వారా పారిశ్రామికవేత్తలకు ఉచితంగా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సైన్ బోర్డు టీజీఐ ఐసీ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్‌జిల్లా సీనియర్ నాయకులు పబ్బు రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ అధ్యక్షునిగా బొబ్బిళ్ల రాజేందర్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ చౌటుప్పల్ మున్సిపల్‌టౌన్ అధ్యక్షుడిగా బొబ్బిళ్ల రాజేందర్‌కు నియామకపత్రాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శనివారం అందజేశారు.ఈ సందర్భంగా బి.రాజేందర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్,స్టేట్ సెక్రెటరీ గండూరి నర్సింహ,సేవాదళ్ మునుగోడు నియోజకవర్గం అధ్యక్షులు రావిరాల రాజేంద్రప్రసాద్,మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పబ్బురాజుగౌడ్,మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి,మాజీ ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి,బోయ దేవేందర్, సుర్వి నరసింహగౌడ్, నాయకులు మెగదాల రమేష్‌గౌడ్,మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాలధారణ వేయడం దేవుడిచ్చిన గొప్పవరం

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చౌటుప్పల్ పురపాలక సంఘం చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు శనివారం ప్రారంభించారు.అన్నదాన పోషకులు కంచర కుంట్ల రామిరెడ్డి దంపతులు చెవ్వగొని వెంకటేశం దంపతులు అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్‌గుప్తా, గురు స్వామి బొబ్బిళ్ళ మురళి, గురుస్వామి తూర్పాటి శంకర్, గురుస్వామి చింతల సాయిలు ఉప్పు ఆంజనేయులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి కంచరకుంట్ల వెంకటరెడ్డి సుక్క సుదర్శన్ పెద్దగోని రమేష్‌గౌడ్, పబ్బుకుమార్, పోలుదాసు నగేష్,బొడ్డు రాజేందర్ రెడ్డి అనుమరాజ రాజశేఖర్ అనంతరామయ్య చౌదరి గుర్రం వెంకటేశం బోరెం వెంకట్ రెడ్డి వేమిరెడ్డి ధర్మారెడ్డి కిన్నె మధుసూదన్ జక్కర్తి శేఖర్ బోడ స్వామి తదితరులు పాల్గొన్నారు

గ్రామాలభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కుంభంఅనిల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-వలిగొండరూరల్

గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి పర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కంచనపల్లి నుండి ఎర్రంబెల్లి వరకు రూ.3.36 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీరోడ్డుకు, కేర్చిపల్లి నుండి మొగిలిపాక వరకు రూ.1.88 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, ముద్దాపురం క్రాస్ రోడ్డు నుండి ముద్దాపురం గ్రామం వరకు రూ.2.35 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీరోడ్డుకు లోతుకుంట క్రాస్‌రోడ్డు నుండి లోతుకుంట గ్రామం వరకు రూ.1.62 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీరోడ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.మండలంలోని వివిధ గ్రామాలను అనుసంధానం చేయుటకు ప్రజల సౌకర్యార్థం రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.గ్రామాలను అన్ని హంగులతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు.అనంతరం చౌటుప్పల్‌లోని దివీస్ ల్యాబరేటరీ వారి సౌజన్యంతో రూ.19.76 లక్షలతో నిర్మించనున్న మహిళా సంగం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ చైర్మెన్ భీమా నాయక్, మత్స్యగిరి ఆలయ కమిటీ చైర్మెన్ కొమ్మారెడ్డి నరేష్‌రెడ్డి, వాకిటి అనంతరెడ్డి,పాశం సత్తిరెడ్డి, బడుగు సత్య నారాయణ, చిట్టెడి జనార్ధన్‌రెడ్డి, బాథరాజు బాల నర్సింహా, కుంభం విద్యాసాగర్‌రెడ్డి, వెంకట పాపిరెడ్డి,సామరాంరెడ్డి, బద్దంసంజీవరెడ్డి,గరిసెరవి, గుర్రంలక్ష్మారెడ్డి, పలుసం సతీష్,ఉప్పల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాల కోసం ఆర్డీఓ కార్యాలయానికి తాళాలు




నవతెలంగాణ-భువనగిరి

విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీ రాందేవ్ గిరిజన విద్యార్థి సంఘం నాయకులు నునావత్ అరుణ్, ఎడ్ల మహాలింగం యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన తెలిపి ఆర్డీఓ కార్యాలయాన్ని శనివారం ముట్టడి చేసి తాళాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ ఈ బీసీ మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లు బకాయిలు చెల్లించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు ఆర్డీఓ కార్యాలయం ముట్టడి చేశామన్నారు.వివిధ పథకాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు మూసిలో మురికి తీయడానికి రూ.1,50,000 కోట్లు ఖర్చు చేస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ ఈ బీసీలకు నిధులు కేటాయించడం లేదన్నారు.100 రోజులలో విద్యార్థుల సమస్యలు అన్ని పరిష్కరిస్తామని, యువతలకు స్కూటీలు ఇస్తామని విద్యార్థులను నిండా ఉంచుతుందన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి హయాంలో ఆర్.కృష్ణన్న అమర్‌నాథ్ దీక్ష మేరకు పేద విద్యార్థులకు పూర్తి ఫీజులు ప్రభుత్వమే భరించిందన్నారు.గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు.అదనంగా నియోజకవర్గానికి రెండు గురుకుల ఏర్పాటు చేయాలన్నారు. కాలేజ్ హాస్టల్స్ జిల్లా కేంద్రాలతోపాటు హైదరాబాద్‌లో కలిపి మరో 400 హాస్టల్స్ మంజూరు చేయాలన్నారు.ఐఐటీ ఐఐఎం కోర్సులు చదివే వారికి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలన్నారు. పోటీ పరీక్షల కోసం జిల్లాకు మూడు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.విద్యాశాఖ మంత్రి ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో భూక్యాబాలాజీనాయక్, రామ్‌చరణ్,చందు,మనీషా, సాయికుమార్,విజయేందర్, శ్రీకర్,నవీన్, అఖిల్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతుకు న్యాయం జరగాలని వినతి

నవతెలంగాణ-రామన్నపేట

ఐకేపీ ధాన్యం కొనుగోలు సెంటర్లలో రైతు దగాకు గురవుతున్నారని వారికి న్యాయం జరగాలని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, కిసాన్‌మోర్చా మండలం ప్రధాన కార్యదర్శి భాష కళ్ళ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏరువాక నుండి ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించి విక్రయించేంతవరకు రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఐకేపీసెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు మందకుడిగా సాగడం, ధాన్యాన్ని ఏ గ్రేడ్ ధాన్యంగా కాకుండా బీ గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేసి నమోదు చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సుతిలి, హమాలీ డబ్బులు రైతు ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయకపోవడం వల్ల రైతుల నష్టపోతున్నారన్నారు.40 కేజీలకు బదులుగా 500 గ్రాములు బస్తాకు తూకం వేస్తున్నారన్నారు. కొనుగోలుకేంద్రాల్లో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీఎం, సిసి, డిటి ల దృష్టికి తీసుకొచ్చామన్నారు. రైతులు నష్టపోకుండా న్యాయం జరగలా చూడాలని కోరామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, ,బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి నల్లబోతు మధు, నాయకులు తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
ఆదివారం | నవంబర్ 17, 2024 | www.navatelangana.com

అయ్యప్పస్వాములకు అల్పాహారం

నవతెలంగాణ-పెద్దవూర



మండలంలోని బట్టుగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి మహాపడిపూజ మహోత్సవం సందర్భంగా సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా అయ్యప్పస్వాములకు, ఆంజనేయ మాల ధరించిన స్వాములకు, భక్తులకు అల్పాహారంను బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని తాంత్రిక గురుస్వామి రామారావు , మండల గోవింద్ గురుస్వామి, పాగంటి మల్లయ్య గురుస్వామి, పేరూరు గోవింద్ గురుస్వాముల ఆధ్వర్యం లో నిర్వహించారు.సుమారు 4200 మంది అయ్యప్ప స్వాములు, ఆంజనేయ స్వాములు,భక్తులకు సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. బుసిరెడ్డి పాండు రంగారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కూన్ రెడ్డి గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకొచ్చిన ఇన్నర్‌రింగ్ రోడ్డు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు పూర్తిగా అవడంతో ఆ రోడ్డుపై వాహనాలు వెళ్లే అవకాశం కలిగిందని మున్సిపల్ వైస్‌చైర్మెన్ కోతి సంపత్‌రెడ్డి,మాజీ చైర్మెన్ దొంత గాని శ్రీనివాస్ గెల్లి రవి తెలియజేశారు.శనివారం రోడ్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోడ్డు పూర్తిగా అవడంతో హుజూర్నగర్ పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా మిర్యాలగూడ రోడ్డు నుండి మట్టపల్లి మేళ్లచెరువు వెళ్లే వాహనాలు ప్రయాణం చేయటానికి అవకాశం లభించిందన్నారు. దీంతో పట్టణానికి కొంత మేరకు ట్రాఫిక్ సమస్య తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవినాయక్,ఎస్ కే సైదా తదితరులు పాల్గొన్నారు.



నెలరోజులైనా ప్రారంభం కానీ ధాన్యం కొనుగోళ్లు

- ఇబ్బందుల్లో రైతులు

నవతెలంగాణ-మోతె

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట ఐకెపి కేంద్రాలకు ,మ్యాక్స్ సంఘాలకు ,కోపరేటివ్ బ్యాంకు కేంద్రాలకు తరలిస్తే లారీలు రాక ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రాంతాలలో మూలుగుతున్నాయని రైతులు భయపడుతున్నారు అకాల వర్షాలు వస్తే తడుస్తాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .మండలంలో ఐకెపి కేంద్రాలు 13 పీఏసీఎస్ కేంద్రాలు, 6 మ్యాక్స్ సంఘాలు, 6 మండలంలో మొత్తం 25 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి నెల రోజులు గడిచిన కాంటాలు ప్రారంభించలేదని రైతులు మొత్తుకుంటున్నారు. అకాల వర్షాలు వచ్చి తడుస్తాయేమోనని భయాందోళన చెందుతున్నారు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తే కొనే నాధుడే కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం సన్న రకం వరి ధాన్యం ఒక గ్రామంలో దొడ్డు ధాన్యం మరొక గ్రామంలో కేంద్రాలు ఉండటం వల్ల ఒక ఊరు రైతులు మరో ఊరుకు వెళ్లి ధాన్యాన్ని రక్షించుకోవడానికి పలు విధాలుగా తంటాలు పడుతున్నారు. పర్టిలైజర్ దుకాణపు దారులు తెచ్చిన అప్పులకు ఇంటి చుట్టూ తిరుగుతుంటే బాధ కలుగుతుందని ఆవేదన చెందుతున్నారు. వెంటనే ధాన్యపు రాశులకు మిల్లులు కేటాయించి తరలించాలని రైతుల కోరుతున్నారు. రైతు బానోత్ చంద్రు తాను ధాన్యాన్ని ఈ కేంద్రానికి తెచ్చి నెల రోజులు గడుస్తుంది అన్నారు. అయినా ఇప్పటివరకు కొనుగోలు చేసే నాధుడు లేడని ఆవేదన చెందారు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతులకు మేలు జరుగుతుందని ఆశపడ్డామన్నారు. రైతు పండించిన ధాన్యానికి ఈ ప్రభుత్వం 500 బోనసు ఇస్తామని హామీ ఇచ్చారని ,ఇప్పుడు సన్న రకానికి 500 రూపాయల బోనస్సు ఇస్తామనటం రైతులను దగ చేయడమే నని అన్నారు తాను పది ఎకరాలు కౌలుకు తీసుకున్న కౌలు రైతు నన్నారు పత్తి మిర్చి వేసి ఇప్పటికే నష్టపోయానన్నార.ు రావి పహాడ్ గ్రామానికి చెందిన ఎర్రబోయిన మల్సూరు తాను పండించిన దొడ్డు ధాన్యం కేంద్రం మా గ్రామంలో లేక మోతే సమీపంలో ఉన్న కేంద్రానికి తెచ్చానన్నారు. 15 రోజులుగా మా గ్రామం నుండి ఇక్కడికి వచ్చి పోతున్నానని చెప్పాడు. మరి కొంతమంది రైతులు ఈ కేంద్రంలోని రాసులు పోస్తే తహసీల్దార్ సంఘమిత్ర ఈ రాశులు బీఆర్ఎస్ రాశులని కాంగ్రెస్ రాశులు కావని జాయింట్ కలెక్టర్ ముందు తహసీల్దార్ చెప్పడం సబబు కాదన్నారు. 5000 బస్తాలు కేంద్రానికి వచ్చి ఉన్న కాంటాలు ప్రారంభించలేదని రైతులు వాపోతున్నారు. ఇంతవరకు ట్యాబు ఎంట్రీ ,గ్రామం మ్యాపు, మిల్లు టాకింగ్ ఇవ్వకపోవడం విచారకరమని రైతులు ఆందోళన చెందుతున్నారు.



జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇప్పించండి

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డికి నల్గొండ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం వినతి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



నల్లగొండ జిల్లాలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో 20ఏళ్లుగా పనిచేస్తున్న నిరుపేద జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ ప్రెస్ క్లబ్, నల్గొండ తరపున తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. నల్లగొండ పట్టణంలో ఓ కార్యక్రమం లో పాల్గొనేందుకు వచ్చిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కి ప్రెస్ క్లబ్ బృందం కలిసింది. మీడియా అకాడమీ చైర్మన్ హెూదాలో తొలిసారి జిల్లాకు రావడంతో పాటు జాతీయ పత్రికా దినోత్సవ సందర్భంగా ప్రెస్ క్లబ్ కార్యవర్గం శ్రీనివాస్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించి శాలువతో సన్మానించారు.. అనంతరం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ, అందుకు మీడియా అకాడమీ తరపున రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తగిన చొరవ తీసుకోవాల్సిందిగా శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ అర్హులైన జర్నలిస్టులను గుర్తించి అందరికీ న్యాయం చేస్తామని, ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై ప్రభుత్వం ఒక పాలసీని రూపొందిస్తుందని ఆ మేరకు కచ్చితంగా నల్లగొండ జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందజేసే ప్రక్రియ ఉంటుందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, కార్యవర్గ సభ్యులు అశోక్ రెడ్డి, ఉపేందర్, ఎండి సాధత్ అలీ, పుప్పాల మట్టయ్య, బజరంగ్ ప్రసాద్, కనకయ్య, భాస్కర్, ప్రేమ్ కుమార్, కంది శీను, బాలరాజు, కృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యం, శేఖర్, హరిప్రసాద్, వెంకట్, అచ్యుతారావు, ప్రసాద్, రమేష్, కుశలవ చారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమం జయప్రదం చేయండి

నవతెలంగాణ-రామన్నపేట

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమాన్ని గ్రామాల ప్రజలు జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు.స్థానిక ఆ పార్టీ మండల కార్యాలయంలో శనివారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను వెలికి తీసి ప్రజలను చైతన్యం చేసి పోరాడేందుకు ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ప్రజా ఉద్యమాలకు ఆర్థిక తోడ్పాటు అందించడం కోసం ప్రతి ఒక్కరూ సీపీఐ(ఎం) ఉద్యమానికి ప్రజా విరాళం అందించాలని ఆయన కోరారు. గ్రామాల్లో గత కాలం నుండి దీర్ఘకాలికంగా అనేక సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరేళ్ల నరసింహ చారి, బల్గూరి అంజయ్య, జంపాల అండాలు, కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, మండల నాయకులు గన్నెబోయిన విజయభాస్కర్, ఎండి రషీద్, నాగటి ఉపేందర్, వేముల సైదులు, గొరిగే సోములు, భావండ్లపల్లి బాలరాజు, మేడి గణేష్, తొలుపునూరి శ్రీనివాస్, ఆనగంటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ



నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల లోని మార్కెట్ యార్డులో గల ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్డీవో శ్రీనివాసులు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం విక్రయాలలో దళారులను ఆశ్రయించవద్దని ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రవేటు వ్యక్తుల ధాన్యంను కొనుగోలు కేంద్రాలలో ఆర బోసుకోవడానికి అవకాశం ఇవ్వవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం ను తూకం వేసి వెంటనే కేటాయించిన రైస్ మిల్లుకు పంపించాలన్నారు. అనంతరం చిల్లేపల్లి వద్ద కొనసాగుతున్న ధాన్యం ట్రాక్టర్లకు టోకెన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ధాన్యంతో వచ్చే ట్రాక్టర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టోకెన్లను వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతులు కూడ రైస్ మిల్లుల వద్దకు పోయి ఇబ్బందులు పడకుండా టోకెన్లు తీసుకొని మీకు కేటాయించిన రైస్ మిల్లుకు పోయి దిగుమతి చేయాలని కోరారు. అప్పుడే మద్దతు ధర లభిస్తుందన్నారు. చిల్లేపల్లి లో కొన సాగుతున్న కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ సురగి సైదులు, ఏఓ జావిద్, జిల్లా సహకార సంఘం ఆడిటర్ నారాయణ శర్మ, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మున్సిపల్ కమీషర్ అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ళ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి, కౌన్సిలర్ రణపంగ నాగయ్య, నాయకులు నర్సింహారావు, పాండునాయక్, కిరణ్, సోమయ్య, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ సిబ్బంది ఉన్నారు.

ఎర్రజెండాను ఆదరించండి.. ప్రజా పోరాటాలను బలపరచండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు

నవతెలంగాణ-బొమ్మలరామారం

ఎర్రజెండాను ఆదరించి, ప్రజా పోరాటాలను బలపరిచి సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న ఉద్యమాలకు విరాళాలు ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు పిలుపునిచ్చారు.శనివారం ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మూడో మహాసభల సందర్భంగా జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 15 నుండి డిసెంబర్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటి కార్యక్రమంలో భాగంగా శనివారం మర్యాల గ్రామంలో ఇంటింఇంటింకి తిరిగి సమస్యలను అధ్యయనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాడుతున్న ఆ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 15, 16, 17వ తేదీలలో చౌటుప్పల్ పట్టణంలో జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల జయప్రదం కోసం, ప్రజా పోరాటాల నిర్వహణ కోసం ప్రజలందరూ ఆదరించాలన్నారు. జిల్లా ఏర్పడి ఎనిమిదేండ్లు గడిచినా ప్రజా సమస్యలు పరిష్కారం నోచుకోలేదన్నారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి ర్యాకలశ్రీశైలం, నాయకులు ప్యారారంవెంకటేష్, గ్రామకార్యదర్శి మధు,మందరాజు, శ్రీపతి రాములు,తదితరులు పాల్గొన్నారు.



మూసీని రాజకీయం చేయొద్దు

- కేంద్రంలో బీఆర్ఎస్, బీజేపీ దోస్తీ
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్



సీఎం రేవంత్ రెడ్డి మూడు నెలలు మూసీలో ఉండాలని సవాల్ విసిరితే, ఒకేరోజు నిద్ర అని నాటకాలు ఆడడం సరికాదని, మూసీని రాజకీయం చేయవద్దని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అనేక మంది రాజకీయ నాయకుల సలహాలు, సూచనలు తీసుకుని మూసీ పునర్జీవం కోసం ఈ ప్రాంత రైతుల కోసం మూసి సుందరీకరణ చేపడుతున్న ముఖ్యమంత్రి పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపణ చేయడం సరికాదని హితవు పలికారు. లక్షలాదిమంది హైదరాబాద్ నీరు అనగా మూసీనదిపై ఆధారపడి బతుకుతున్నా వారి జీవితాల్లో వెలుగు నింపడానికి ఈ కార్యక్రమం తీసుకున్నట్లు తెలిపారు. మూసి ప్రాంతంలో నివసిస్తున్న ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించి మూసి పునర్జీవ కార్యక్రమం చేపడుతున్నట్లు, కిషన్ రెడ్డి అవగాహన లేకుండా పేదల ఇండ్లు కూలగొడుతున్నారని అనడం సరికాదన్నారు. సబర్మతి నది కోసమే 40 వేల మంది ఇండ్లను కూలగొట్టు లేదా అని ప్రశ్నించారు. ఇంట్లోను తీసివేయకుండా ప్రక్షాళన ఎలా జరుగుతుందన్నారు. నేను సవాల్ విసురుతున్న మీరు చేయవలసిందిగా కాదు, మోడీ వద్ద నిద్ర చేయాలన్నారు.నమామి గంగా కింద మూసినదిని ప్రక్షాళన చేయాలని, లేనియెడల నిర్మాణాత్మకంగా ప్రశ్నించాలి తప్ప చేసే పనిని విమర్శించడం సరికాదన్నారు. కిషన్‌రెడ్డి కేటీఆర్‌ని ఢిల్లీకి తీసుకువెళ్లలేదా...? మీరు కేటీఆర్ ఎందుకు తీసుకువెళ్లారు.. ఆయన ఏమైనా మంత్రి ... బీఆర్ఎస్,బీజేపీ దోస్తాన్ ఇది కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రజలకు మేలయ్యే కార్యక్రమాన్ని తేవాలి తప్ప అభివృద్ధిని అడ్డుకోరాదని హితవు పలికారు.

ఫేక్ కాల్స్ తో తస్మాత్ జాగ్రత్త..!

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

'నీ కుమారుడు, కుమార్తె డ్రగ్ కేసులో దొరికడాని అతని కేసు నమోదైందని మీరేదైనా మాట్లాడుకొని విడిపించుకోవాలని లేనిపక్షంలో అతని భవిష్యత్ అగమౌతుందని వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి'అని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ కోరారు.శనివారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీబీఐ ఢిల్లీ నుంచి మాట్లాడుతున్నానని వచ్చే ఫోన్ కాల్స్ కు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు స్పందించవద్దని పేర్కొన్నారు. ఈనెల 12న ఒకసారి,16న ఒకసారి నాకు స్వయంగా ఫోన్ చేశారని, తీవ్రంగా వాళ్లతో వాగ్వాదం పెట్టుకోవడంతో ఫోన్ కట్ చేశారని చెప్పారు.12న 92330609878 9 నెంబర్ తో,16న 923281561189 ఫోన్ నెంబర్ల నుండి ఫోన్ చేసి బెదిరించినట్లు చెప్పారు. వాళ్లు వాట్స్ అప్ కాల్స్ చేస్తున్నారని ఆందోళన చెందాల్సిన, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం ఆర్డిఓ వేణుమాధవ్ ఆకస్మికంగా సందర్శించారు. మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి రాజకీయ మరియు కుల సర్వే యొక్క డేటా ఎంట్రీ ని సోమవారం నుండి చేయుటకు కంప్యూటర్లు మరియు ఇతర సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆర్డిఓ వేణు మాధవరావు సూచించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ బుచ్చిబాబు తహసీల్దార్ బి.హరిప్రసాద్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

నవతెలంగాణ-తుంగతుర్తి

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసిల్దార్ దయానంద్,ఎస్సై క్రాంతి కుమార్ కుమార్ అన్నారు.శనివారం మండల కేంద్రంతో పాటు,మండల పరిధిలోని వెంపటి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించి కాంటాలను రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావలసిన కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు సొసైటీ సీఈవో వెంకటేశ్వర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లా గ్రంథాలయ సంస్థ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల లో వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు పర్యావరణం పై ప్లాస్టిక్ ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి బాలమ్మ ఉమ్మడి జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం. ఎస్.శ్రవణ్ కుమార్, గ్రంథాలయ అధికారి వడ్డే శ్యాంసుందర్ రెడ్డి, లైబ్రేరియన్ ఎంవి .రంగారావు, కె.విజయభాస్కర్, పి.సృజన ఉపాధ్యాయులు చారి, సుమతి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జివి, గవిశ్వజ్ఞ చారి పాల్గొన్నారు

గ్రూప్ -3 పరీక్షలకు 160 మంది పోలీస్ బందోబస్తు

- సీఐ కోట కర్నాకర్

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ పట్టణం, మండలంలో ఈ నెల 17, 18న టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించ నున్న గ్రూపు -3 పరీక్షల నిర్వహణకు గాను మిర్యాలగూడ డిఎస్పి కె.రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో 160 పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించ నున్నట్లు ఒన్ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ కోట కరుణాకర్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్ లో విలేఖరులతో మాట్లాడుతూ మిర్యాలగూడలోని 28 పరీక్ష కేంద్రాలకు నలుగురు సిఐలు, 15మంది ఎస్ఐలు, 28 మంది ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, 113 మంది కానిస్టేబుల్స్ బందోబస్తులో ఉంటారని ఆయన తెలిపారు. నాలుగు రూట్లు ఏర్పాటు చేసినట్లు ఆయా రూట్లలో ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్, పెన్, పెన్సిల్ తప్ప ఇతర ఎలక్ట్రానిక్ సామాగ్రి అనుమతించబోమని ఆయన తెలిపారు. షడస్ వేసుకుని రావద్దని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల 300 మీటర్ల వరకు నిషేధాజ్ఞలు సెక్షన్ 144 2 రోజుల పాటు అమలులో ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా పరీక్షలు జరుగుతున్న పట్టణ, మండల ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-మునగాల



ధాన్యల కొనుగోలుకేంద్రాల్లో అన్ని రకాల సన్నాలను కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చందా చంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.ప్రభుత్వం సెంటర్ల ద్వారా 33 సన్న రకాల ధాన్యాలను ఎంపిక చేసిందన్నారు.అయితే ప్రభుత్వం సూచించిన సన్న రకాలు ఈ ప్రాంత రైతులు సాగు చేయలేదని చెప్పారు.ఆయకట్టు పరిధిలో అధికంగా చింట్లు హెచ్ఎంటీలు మాత్రమే సాగు చేశారని తెలిపారు.ఈ రకం ధాన్యం కొనేందుకు సెంటర్ల నిర్వాహకులు నిరాకరిస్తున్నారని చెప్పారు.దీంతో వందలాది మంది రైతులు దిక్కుతోచని స్థితిలో సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సన్నరకాల్లో కూడా ప్రభుత్వం ఇలాంటి నిబంధనలు పెట్టడం సరికాదన్నారు.చేతి కొచ్చిన పంటలు అమ్ముకోవటం రైతులకు భారంగా మారిందన్నారు.నేటికి కొన్ని సెంటర్లకు ధాన్యం దిగుమతుల కోసం రైస్ మిల్లులను అలాట్ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రభుత్వ మద్దతు ధర పొందాలి:రైతులు కొనుగోలు సెంటర్లలో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతుధరలు పొందాలని కోదాడ ఏడీఏ పుల్లయ్య తెలిపారు.మొద్దులచెర్వుస్టేజీ వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దీనదయాల్, మండల వ్యవసాయ అధికారి బుంగరాజు,సహకార సంఘం సిబ్బంది కోటయ్య, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-శాలిగౌరారం

మండలంలోని వల్లల గ్రామంలో , తేది 15.11.2024 రోజు సాయంత్రం, 04.00 గంటల సమయంలో కోయగూరి కోటమ్మ,భర్త మల్లయ్య, వయస్సు 70 సంవత్సరాలు, కులం గౌడ్ గ్రామం వల్లాల అను మహిళ తన ఇంటి ముందు వున్నా చెట్టు కింద కూర్చొని ఉండగా, వంటెపాక సాయి తండ్రి భాస్కర్ అను వ్యక్తి తన టీవీఎస్ బైక్ పై నకిరేకల్ నుండి శాలిగౌరారం వైపు వెళుతూ ఉండగా బైక్ అదుపు తప్పి కోటమ్మ ను డీ కొట్టగా, గాయాలపాలైన కోటమ్మ ను మెరుగైన వైద్యం కోసం నల్గొండ ఐకాన్ హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినది. అని కోటమ్మ మనుమడు సంపత్ ఇచ్చిన దరఖాస్తు మేరకు, ఎస్ఐ డి, సైదులు తెలిపిన వివరాల ప్రకారం సాయి పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే

నవతెలంగాణ-మద్దిరాల

మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం తహశీల్దార్ అమీన్ సింగ్ ఈ సర్వేను ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే కి ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ వైద్య కళాశాల భవనాన్ని నెలాఖరు నాటికి పూర్తి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ -నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి.



నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణాన్ని ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె ఎస్ఎల్‌బిసి కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనాన్ని తనిఖీ చేశారు.టీజీ ఎస్ ఎం ఐ డీ సీ చీఫ్ ఇంజనీర్ దేవేందర్ కుమార్ వైద్య కళాశాల భవన నిర్మాణ పనుల పరిస్థితిని వివరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30 నాటికి పనులను పూర్తి చేయాలని, డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. కళాశాలకు సంబంధించిన ఫర్నిచర్,ఇతర సామాగ్రిని తరలించేందుకు అవసరమైతే రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు.వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్స్ రామచందర్, రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు .

రైతులకు ఇబ్బందుల్లేకుండా వరి కోతలు నిర్వహించాలి

తిరుమలగిరి : మండలం లోని తహసిల్దార్ కార్యాలయంలో శనివారం హార్వెస్టర్ల యజమానులతో ఆర్డిఓ ఆర్ వేణు మాధవరావు సమావేశం నిర్వహించినారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వరి కోతలు చేయాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బి.హరిప్రసాద్ డిప్యూటీ తహసీల్దార్ జాన్ మమ్మద్ ఏవో నాగేశ్వరరావు ఎస్ ఐ వి సురేష్ ఏఈఓ లు ఆర్ ఐ లు,ఏపీఎం పాల్గొన్నారు

తూములకు డోర్లను ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-వలిగొండ రూరల్




మండల పరిధిలోని ధర్మారెడ్డి పల్లి కాలువ కత్వా వద్ద ఉన్న డోర్లు పూర్తిగా లేకపోవడం వలన,గోకారం రామసముద్రం చెరువుకు ఉన్న తూములకు ఉన్న డోర్లు లేకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే యుద్ధప్రతిపాదికన ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్ లు డిమాండ్ చేశారు.శనివారం సిపిఐ(ఎం) గోకారం గ్రామ శాఖ అధ్వర్యంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మారెడ్డిపల్లి కాలువ కత్వ వద్ద ఉన్న తూముకు గేట్లు లేకపోవడం వలన ప్రజలుకు నీళ్ల అవసరం లేని సందర్భాల్లో బంద్ చేయలేకపోవడంతో నీళ్ల ఎక్కువ కావడం వలన రైతులు పంట నష్టపోతున్నారని తెలిపారు. గోకారం రామసముద్రం చెరువుకు ఉన్న మూడు తూములకు మొత్తం డోర్లు లేకపోవడం వలన పంట అయిన సమయాల్లో కూడా నీరు వచ్చిందన్నారు. తూములలో పూర్తిగా మట్టి పోసి బంద్ చేస్తున్న సందర్భాల్లో కొందరు రైతులు ఇప్పటికే గాయపడ్డారన్నారు. కాబట్టి వెంటనే ఎమ్మెల్యే స్పందించి కాలువ కత్వ వద్ద ఉన్న గేట్లకు తూములు,చెరువుకు ఉన్న తుములకు గేట్లు అన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ(యం) శాఖ కార్యదర్శి కవిడే సురేష్, నాయకులు చెర్క వెంకటేష్,నారి రామస్వామి, జంగయ్య,తూర్పునూరి శంకరయ్య,నారి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కొనుగోలుకేంద్రాలను సందర్శించిన ఆర్డీవో

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ నగర్ ధాన్యం కొనుగోలు సెంటర్ ను శనివారం ఆర్డిఓ ఆర్ వేణుమాధవ్ రావు పరిశీలించారు. మిల్లు ట్యాగింగ్ చేయించి కాంటాలు వేయాలని సూచించినారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి హరి ప్రసాద్, ఏవో నాగేశ్వరరావు, ఏపిఎం మధుసూదన్ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



నియోజకవర్గ వ్యాప్తంగా మాల మహానాడు అధ్యక్షుల ఎన్నిక

నవతెలంగాణ-తిరుమలగిరి

సుప్రీంకోర్టు అనుకూల తీర్పు రివ్యూ పిటిషన్ దాఖల కొరకు నియోజకవర్గ వ్యాప్తంగా మాలలు కలిసి చైతన్యవంతంగా ముందుకు సాగాలనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట%శీ% కమిటీ, రాష్ట్ర కో కన్వీనర్ ఎర్రమళ్ళ రాములు, సూర్యాపేట జిల్లా కన్వీనరు వీర్జాల వేణు బలరాం,సూర్యాపేట కో కన్వీనరు కట్ట సైదులు, మురళి, అఖిల్,రవి ఆధ్వర్యంలో వివిధ మండలాలు, వివిధ గ్రామాల అధ్యక్షులు, మాలలు అందరూ కలిసి శనివారం తిరుమలగిరి మున్సిపాలిటీ లో ఎస్ ఎస్ వి ఫంక్షన్ హాల్ లో నూతనంగా సూర్యాపేట జిల్లా కో కన్వీనర్ గంట యాకోబు, తుంగతుర్తి నియోజకవర్గం కన్వీనర్ చింతపల్లి శేఖర్, తిరుమలగిరి మండలం అధ్యక్షులుగా గంట సందీప్, ఉపాధ్యక్షులు పెరమళ్ళ జానీ, నాగారం మండలం అధ్యక్షులుగా జాన్ వెస్లీ, ఉపాధ్యక్షులుగా వంపు అమృతి కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కో కన్వీనర్ ఎర్రమళ్ళ రాములు మాట్లాడుతూ డిసెంబర్ ఒకటో తారీఖున హైదరాబాదులో జరగబోయే మాల సింహ గర్జన సభకు మాలలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మున్సిపాలిటీ అధ్యక్షులు గంట లక్ష్మణ్, మాల సంఘ నాయకులు మద్దెల ప్రభుదాస్, గంట సుమంత్, సాలమన్, గడ్డి దిలీపు, దావీద్ దీపు, రవి పాల్గొన్నారు.

కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో యాకూబ్ నాయక్



నవతెలంగాణ-రామన్నపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేను శనివారం మండలకేంద్రంలో స్థానిక ఎంపీడీవో భూక్యా యాకూబునాయక్ పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తం చేసిన పలు అనుమానాలకు ఆయన సమాధానమిచ్చారు. సమగ్రమైన సమాచారాన్ని ఇవ్వాలని ఆయన సందర్భంగా ప్రజలకు సూచించారు.ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా వివరాలన్నింటిని నమోదు చేయాలని సూచించారు.ప్రజలకు అన్ని ప్రశ్నలను వివరించి వారు చెప్పే సమాధానాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

20 క్వింటాల సీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-తుంగతుర్తి

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించినట్లు ఎస్సై ఆర్ క్రాంతికుమార్ తెలిపారు. శనివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యాదాద్రి జిల్లా లోని భువనగిరి మండలం పచ్చర్ల బోర్డు తండా కు చెందిన బాలోతు భాను,యాదగిరిగుట్ట మండలం లప్ప నాయక్ తండాకు చెందిన దరావత్ భరత్ ఇద్దరు కలిసి ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొని హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న కోళ్ల ఫారాల వారికి అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు .ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని దొంగతనంగా అక్రమ రవాణా చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు అన్నారు .

ఘనంగా నల్గొండ సమగ్ర స్వరూపం ఆవిష్కరణ

- నల్గొండపై మరిన్ని పరిశోధనలు రావాలి
- మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-ప్రాంతీయ ప్రతినిధి



నల్గొండ సమగ్ర స్వరూపం గ్రంథం ఆవిష్కరణ నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో శనివారం ఘనంగా జరిగింది. ఈ గ్రంథ ఆవిష్కరణ తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కల్మకోలను శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నల్లగొండ పై మరిన్ని పరిశోధనలు రావాలని పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నల్గొండ జిల్లా సర్వస్వాన్ని రూపొందించి విడుదల చేస్తున్నదని, గతంలో అనేక మంది వ్యక్తులు, సంస్థలపై కొన్ని జిల్లాలలో సారస్వాలు వచ్చినప్పటికీ తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించిన నల్గొండ జిల్లా సారస్వము సమగ్రంతో కూడుకొని ఉందని ,తెలంగాణ సారస్వత పరిషత్తు తీసుకువచ్చిన ఈ గ్రంథంలో అన్ని అంశాలను పొందుపరిచారని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ సారస్వంత పరిషత్తు ను అభినందించారు .నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథావిష్కరణ సభలో చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య సూర్య ధనుంజయ్, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆచార్య సాగి కమలాకర్ శర్మ, సంయుక్త సంచాలకులు సమాచార ప్రజా సంబంధాల శాఖ కన్నెకంటి వెంకట రమణ, కార్యదర్శి జుర్రు చెన్నయ్య మాట్లాడుతూ, తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, పర్యాటక ప్రదేశాలు, జాతరలు, పండుగలు, వైద్య ఆరోగ్య వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి మొదలైన అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న సమగ్ర స్వరూప గ్రంథాల పరంపరలో ఇది 20వ జిల్లా అని అన్నారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ, సమాచార, పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు కన్నెకంటి వెంకటరమణ, నాగార్జున డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డా వెల్దండి శ్రీధర్,, ప్రముఖ సాహితీవేత్త డా. శ్రీరంగాచార్య, డా తండు కృష్ణ చైతన్య, డా. బండారు సుజాత శేఖర్, పున్న అంజయ్య, డా. భీన్నూరి మనోహరి, డా సాగర్ల సత్తయ్యలు అతిథులుగా హాజరయ్యారు. సారస్వత పరిషత్తు ఇప్పటివరకు జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూలు, రాజన్న సిరిసిల్ల, వనపర్తి, నిజామాబాద్, సిద్దిపేట, ఆదిలాబాద్, మంచిర్యాల, కామారెడ్డి, కరీంనగర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రక పరిషద్ 19 జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలను అందుబాటులోకి తెచ్చింది. నల్గొండ జిల్లా 20 వ ప్రచురణ. మరి కొన్ని జిల్లాల సమగ్ర స్వరూపం ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సంపుటాలు పూర్తయితే వివిధ రంగాల్లో తెలంగాణ విశ్వరూపం ప్రదర్శితమయ్యే అక్షర సంపద అందుబాటులోకి వస్తుందని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య తెలిపారు.దాదాపు 435 పేజీలకు పైగా ఉన్న ఈ గ్రంథంలో నల్లగొండ జిల్లాకు సంబందించిన దాదాపు పలు చారిత్రక, సాహిత్య, నైసర్గిక స్వరూపం, విద్య, కళా, సాహితీ, రాజకీయ, ఆధ్యాత్మిక రంగాలపై 45 మంది ప్రముఖులు రాసిన వివిధ వ్యాసాలున్నాయి. శాసనాల శాస్త్రి గా పేరొందిన బీ.ఎస్ శాస్త్రి రచించిన నల్లగొండ జిల్లా సర్వస్వం అనంతరం సమగ్ర రూపంలో తిరిగి తెలంగాణా సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం వెలువడిందాని వెంకటరమణ అన్నారు.

డిసెంబర్ 15, 16 ,17వ తేదీల్లో
సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభలు

- చౌటుప్పల్ బహిరంగ సభను విజయవంతం చేయండి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ



నవతెలంగాణ-భువనగిరి

డిసెంబర్ 15 16 17వ తేదీల్లో చౌటుప్పల్లో నిర్వహించనున్న సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ విజ్ఞప్తి చేశారు.శనివారం స్థానిక సుందరయ్య భవన్లో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణ ప్రజలు ప్రజా పోరాటాలను ఆదరించి ఆర్థిక సహకారాలు అందించాలని కోరారు.పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు నిర్మాణం పూర్తయిన అంబేద్కర్ భవనం నేటికీ ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తపరిచారు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఐదు కోట్లు బడ్జెట్ కేటాయించి అదేవిధంగా మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించాలన్నారు నిర్మాణం పూర్తయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఇప్పటివరకు ప్రారంభం నోచుకోలేదన్నారు. పట్టణ బైపాస్ రోడ్డులో సింగన్నగూడెం చౌరస్తా, కృష్ణాపురం చౌరస్తా వద్ద అండర్పాస్ రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు పట్టణంలో టౌన్ హాల్ నిర్మించాలని కోరారు. జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యాలు మెరుగు పరచాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, కార్యవర్గ సభ్యులు బందెల ఎల్లయ్య, బర్ల వెంకటేష్, కల్లూరి నాగమణి, చింతల శివ పర్వతం బాలకృష్ణ, ఈర్ల రాహుల్, సుందరయ్య, అంజయ్య, సలీం,రవి, భాగ్య, వెంకటేష్,లింగం, లలిత, నవనీత పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నవతెలంగాణ-కోదాడరూరల్



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుంది అని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఘాటుగా విమర్శించారు. శనివారం మండల పరిధిలోని ఎర్రవరం గ్రామ శివారులో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో ఉన్న వడ్ల రాశులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి గింజను కొంటానని తెలిపి ఇంతవరకు కొనకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఒకవేళ కొంటే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యపురాశులు ఎందుకు ఉంటాయి అన్నారు. హడావుడిగా టెంటు వేసి, ఫ్లెక్సీలు పెట్టి హడావుడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు అన్నారు. 15 రోజుల క్రితం ధాన్యం పోస్తే శుక్రవారం సాయంత్రం వరకు ప్రభుత్వం నిర్ణయించిన కొన్ని రకాల ధాన్యాలే కొనాలి ఆ లిస్టులో మీ ధాన్యం లేదు అని రైతులకు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు అని అన్నారు. ధాన్యాన్ని ఆరబోసుకొని తీసుకొని వస్తే మ్యాచర్ ఉంటేనే తీసుకుంటామని తెలుపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అన్నారు. వర్షాలు వస్తే పంట ఆగమయిద్దని చెప్పిన వినడం లేదని ఏమి చేయాలో పాలు పోక దళారులకు అమ్ముతున్న పరిస్థితి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. వడ్ల బస్తాలు లేక వర్షాలు వస్తే పట్టాలు లేక ఎలాగోలా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొని వస్తే కొనకుండా ఇబ్బందులు గురిచేయడంతో దిక్కుతోచక రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు అన్నారు. రెండు కళ్ళ లటి ఈ నియోజకవర్గాలు అన్నారు గా ఆ నియోజకవర్గ రైతులు బాధపడుతుంటే వారికి కనబడట్లేదా అని గాటుగా విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేయనిది.. కేంద్రాలు ఎందుకు ప్రారంభించినట్లు అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు లేవు తడిస్తే పట్టాలు లేవన్నారు.ధాన్యం తీసుకొచ్చిన రైతుకు భద్రత లేదన్నారు.ధాన్యం కొనుగోలు సేకరణ మొదలు పెట్టాలని మంత్రి ఉత్తమ కుమార్రెడ్డికి,ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి ప్రత్యక్షంగా చెబుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయుడు, మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షులు అన్నెం అంజిరెడ్డి, దొంతగాని అప్పారావు, వరదరావు, ముత్తవరపు రమేష్, ఉద్దండు, బోసు, వెంకటొరెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-నిడమనూరు

వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన శనివారం మండల పరిధిలో ని బంకా పురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం అనుమానస్పదంగా మృతి చెందాడు అతని వయసు (50). మృత దేహం గుర్తు పట్టలేనంతగా ఉబ్బిపోయి ఉంది. ఎవరికైనా తెలిసిన వ్యక్తి అయితే పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని పేర్కొన్నారు. మృత దేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నాంపల్లి



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాద్ ఫరెడ్ గ్రౌండ్లో జరగనున్న మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ నాంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాంపల్లి మండల మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు గొల్ల బోయిన వెంకటయ్య, పెరుమాండ్ల ప్రభుదాస్, మహేశ్వరం కృష్ణయ్య, మహేశ్వరం సతీష్, కోరే యాదయ్య, గిరి స్వామి, ఈద శేఖర్, కోరే సాయిరాం, బేగరి గిరి, కోరే శ్రీనివాస్, కోరే కిషన్, కోరే అశోక్, పెరుమాండ్ల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షా ఫీజు గడువు 30 వరకు పొడిగించాలి

- బీసీ నేత లింగంగౌడ్

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్



పదవ తరగతి పరీక్షా ఫీజు చెల్లింపు గడువు ఇంకా రెండు రోజులే ఉన్నందున ఈ నెల 30 వరకు పొడిగించాలని విద్యాశాఖ డైరెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు వారికి సంబంధించిన స్కూల్ ఎడ్యుకేషన్ వివరాలు ఇంకా యుడైస్ పోర్టల్లో నమోదు చేసుకోలేదని గతంలో కేవలం పదవ తరగతి విద్యార్థుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తే ఫీజు చెల్లించే అవకాశం ఉండేదన్నారు. కానీ ఈ సంవత్సరం ఖచ్చితంగా 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలు ఆన్లైన్లో నమోదు తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులు వారి వివరాలు ఇంకా పూర్తిస్థాయిలో నమోదు చేయకపోవడంతో పాటు ఆన్లైన్లో విద్యార్థులు నమోదులో సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని వాటిని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 18 నుంచి 30 వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ -శాలిగౌరారం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడినట్టుగా ఎస్ఐ, డి, సైదులు తెలిపారు . శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలోని మాదారం కలాన్ గ్రామంలో మధ్యాహ్నం అక్రమంగా రేషన్ బియ్యం సేకరిస్తున్నారని నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. మాదారం కాలాన్ గ్రామానికి పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లగా జక్కుల చంటి ఇంట్లో పీడీఎస్ బియ్యం నిలువచేసి ఉన్నాయి. సుమారు 26 క్వింటాల స్వాధీనం చేసుకొని వాటిని పోలీస్ స్టేషన్ కి తరలించామన్నారు. విక్రయిస్తున్న జక్కుల చంటిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ముదిరాజ్లకు ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆలేరుటౌన్

కర్ణాటక రిజర్వేషన్ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో, రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజులకు రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలని, ముదిరాజ్ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు పండుగ బాలు అన్నారు. ఆలేరు మండలకేంద్రంలో శనివారం ముదిరాజ్ సంఘం జిల్లా స్థాయి సమావేశం, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొలుపుల హరినాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ నేల 21 తేదిన ముదిరాజ్ జెండా పండుగ విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ ముదిరాజులకు ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాటు ద్వారా, చదువుకున్న పేద విద్యార్థులకు యువతకు ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. రిజర్వేషన్ ఫలాలు పొందడం ద్వారా ముదిరాజ్ జాతి అభివృద్ధి చెందుతుందని తెలియ జేశారు. రిజర్వేషన్ల సాధన కొరకు ఐక్యంగా పోరాటాలకు సిద్ధమవాలన్నారు.కర్ణాటక రాష్ట్రంలో లింగాయతులు 17శాతం ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజులు 13.9 శాతం ఉన్నారని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు జరగాలని ప్రభుత్వాన్ని కోరారు.కొన్నేండ్లుగా ముదిరాజ్లను బీసీఏలోకి మార్చాలని కోరుతూ ఉద్యమాలు జరిగాయని, ఈసీఏలో ఉన్నవారు తమలోకి ముదిరాజ్లు వద్దని చెబుతున్నారని గుర్తు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, లింగాయితులకు రిజర్వేషన్లు ప్రకటించినదని, ఏ మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని ముదిరాజులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు కొలుపుల హరినాథ్ మాట్లాడుతూ 21వ తేదీన జరిగే సమావేశంలో ముదిరాజ్ సంఘం భవిష్యత్ విధి విధానాలు రూపొందిస్తామన్నారు.ఆ సంఘం నాయకులు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఇతర సంఘాల మాదిరిగా సోషల్మీడియాను ముదిరాజ్లు విస్తృతంగా ఉపయోగించాలని సంఘం సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు పండుగ బాలు, జిల్లా అధ్యక్షులు కొలుపుల హరినాథ్, ఉపాధ్యక్షులు శెట్టి శ్రీనివాస్, చెక్క వెంకటేష్, పల్లెపాటి బాలయ్య,జిన్న కృష్ణ, జిల్లా ఫిషరీస్ చీప్ ప్రమోటర్ పాశం సంజయ్బాబు, కస్తూరి పాండు, ఇండ్ల వెంకటేష్, శ్రీనివాస్,చెక్క పరుశరాములు, పూల నాగయ్య, పులి చంద్రమౌళి, ఎన్నబోయిన సత్యనారాయణ, గొడుగు నరసింహ, ఇడ్ల వెంకటేష్, పాండవుల భిక్షపతి, ఎల్లబోయిన సంతోష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 2న బహిరంగ సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-దామరచర్ల

సీపీఐ(ఎం) 21వ జిల్లా మహాసభలు సందర్భంగా డిసెంబర్ 2న మిర్యాలగూడ లో జరిగే బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు తరలి రావాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు , మాలోత్ వినోద్ నాయక్ పిలుపు నిచ్చారు. ఎస్ పాపా నాయక్ అధ్యక్షతన స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో జిల్లా మహాసభల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా పాలనా కొనసాగిస్తున్నదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను నికరంగా నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మాలోతూ వినోద్ నాయక్ మండల కమిటీ సభ్యులు పాపా నాయక్, దయానంద్, కోటిరెడ్డి, ఎర్ర నాయక్, సుభాని, వెంకటయ్య, శ్రీను, కాంతారావు, చంద్రకళ, దుర్గయ్య, కాజా మొహిద్దిన్, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన భార్యాభర్తల అరెస్టు

నవతెలంగాణ- నాగార్జునసాగర్



చిట్టీల వ్యాపారం పేరుతో ప్రజలను మోసం చేసిన భార్యాభర్తలను జెన్కో ఎస్ఈ రఘురాం ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్టుగా సీఐ బీసన్న తెలిపారు. శనివారం నాగార్జునసాగర్ లోని పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నాగార్జునసాగర్ పైలాన్ కాలనీకి చెందిన తురక శ్రీనివాస్ రావు ,అతని భార్య లక్ష్మీ పద్మావతి చిట్టీల వ్యాపారం పేరుతో జెన్కో ఉద్యోగులు, స్థానిక ప్రజలు ను మోసం చేశారని తెలిపారు . చిట్టీల డబ్బులు తిరిగి అడిగినందుకు వారిపై పెంపుడు కుక్కలను వదిలి భయాందోళనకు గురి చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. శనివారం సదరు భార్యాభర్తలు తమ సొంత కారులో ఆంధ్రకు పారిపోతుండగా తమకు అందిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. చీటీల పేరుతో ప్రజలను మోసం చేసిన శ్రీనివాస్ రావు లక్ష్మీ పద్మావతి లకు లక్ష్మీ పద్మావతి సోదరుడు షరీఫ్ సహకరించినట్లుగా తెలిపారు . వీరి వద్దనుండి నెక్సా కారును, సెల్ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్కు తరలించినట్లుగా తెలిపారు. వీరితోపాటు స్థానిక ఎస్సై సంపత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

డాక్టర్ ప్రభాకర్ కు సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు మండల కేంద్రంలో శనివారం డాక్టర్ ప్రభాకర్ని, ఇండియన్ డాక్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకొని ,అర్పిత నర్సింగ్ హోమ్లో ఆయన అభిమానులు శాలువాతో ఘనంగా సన్మానించారు.శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకర్, భిక్షపతి, జాని, సు

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం

నవతెలంగాణ-నూతనకల్



ఈనెల 29, 30 డిసెంబర్ ఒకటి తేదీలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోనీ సుమాంజలి ఫంక్షన్ హాల్లో జరిగే సీపీఐ(ఎం) జిల్లా తృతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తోట్ల మల్సూర్ స్మారక భవనంలో మండల కార్యదర్శి కందాల శంకర్రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఇట్టి మహాసభలకు జిల్లా వ్యాప్తంగా 23 మండలాలు, ఆరు పట్టణ కమిటీల నుండి 1200 మంది ఎంపిక చేయబడిన ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈనెల 29న సూర్యాపేట పట్టణంలో మహా ప్రచాప్రదర్శన గొప్ప బహిరంగ సభ నిర్వహించినట్లు పేర్కొన్నారు ఇట్టి బహిరంగ సభకు సిపిఎం నాయకులు కార్యకర్తలు అభిమానులు విద్యా వంతులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బొజ్జ శ్రీను మండల కమిటీ సభ్యులు తోట్ల లింగయ్య గజ్జల శ్రీనివాసరెడ్డి, బత్తుల తిరుమలేష్ గాజుల జానయ్య, బాణాల సంధ్య తొట్ల రాంబాబు, అంజపెల్లి లక్ష్మయ్య ముళ్ళ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

గౌతమి ఉన్నత చదువులకు అండగా ఉంటాం

- రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అండ్ అసోసియేషన్ వెల్ఫేర్
- మెడికల్ విద్యార్థినికి రూ. 60 వేల ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-సూర్యాపేట



తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన మెడికల్ విద్యార్థిని సిగ గౌతమి ఉన్నత చదువుల కోసం అండగా ఉంటామని రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అండ్ అసోసియేషన్ వెల్ఫేర్ జిల్లా సభ్యులు పేర్కొన్నారు. శనివారం స్థానిక అసోసియేషన్ భవన్లో జరిగిన కార్యక్రమంలో గౌతమికి రూ. 60 వేల ఆర్థిక సహాయం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. గౌతమి ఆర్థిక ఇబ్బందులతో ఉన్నందున అసోసియేషన్ తరపున రూ.10వేలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కేతేపల్లి మండలానికి చెందిన ఉప్పలపాడు గ్రామానికి చెందిన డాక్టర్ ప్రముఖ పిల్లల వైద్యులు గుర్రం విద్యాసాగర్ రెడ్డి యూఎస్ఏ నుండి 50 వేల రూపాయలు విరాళాలంగా పంపినారని అవి అబ్దుల్లా ద్వారా అసోసియేషన్ చేరాయని పేర్కొన్నారు.ఇందులో గాలి శ్రీనివాస్ 2000, కేతేటి రంగారెడ్డి 1000, అబ్దుల్లా1000, లాలు1000,వెంకన్న 1000, వెంకటేష్ గౌడ్ 1000, లక్ష్మీకాంతరెడ్డి 1000, సత్తార్ ఎస్సై 1000, నాగయ్య1000,బేగు 500 అందరూ కలిసి ఆఫీసు తరపున 10000,విద్యాసాగర్ రెడ్డి నుండి 50 వేల రూపాయలు కలుపుకొని మొత్తంగా 60 వేల రూపాయలు గౌతమికి అందజేయడం జరిగిందని వారు వివరించారు. మునుముందు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడుతామని వారు స్పష్టంచేశారు.

టీటీడీ కల్యాణ మండపాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణమండపాన్ని మునుగోడు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్చార్జి బడుగు లక్ష్మయ్య శనివారం పరిశీలించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 1995లో ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుచే ప్రారంభించారు.ఈ మండపం ద్వారా పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పెండ్లిలు శుభ కార్యక్రమాలు చేసుకోవడానికి వీలుగా ఆనాడు రాష్ట్ర మంత్రివర్యులు స్వర్గీయ ఎలిమినేటి మాధవ రెడ్డి సహకారంతో నిర్మాణం జరిగినది. తదానంతరము ఎంతో మందికి ఈ కళ్యాణమండపం ద్వారా కార్యక్రమాలు జరిగినవి.కానీ వర్షము విపరీతంగా పడటం వలన కాలువ పెద్ద ఎత్తున వచ్చి కళ్యాణ మండపం ప్రహరీ గోడ ధ్వంసం అయినది అదేవిధంగా కళ్యాణ మండపంలో అక్కడక్కడ ఫ్లోరిన్ దస్కింది కిటికీలకు అద్దాలు లేవు ఫ్యాన్ల సౌకర్యం ట్యూబ్ లైట్లు ప్రస్తుతం పనిచేయటం లేదు కావున దీని పనుల నిమిత్తం కొంత నిధులు ప్రకటించి కళ్యాణమంటపాన్ని బాగు చేపించాలని ఇట్టి విషయాన్ని శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ గౌరవ నన్నూరు నర్సిరెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లను వారు ఇట్టి విషయాన్ని దేవస్థాన కమిటీ లో పెట్టి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినారు వారికే ఈ ప్రాంత ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వర్గాల వెంకటేష్ గౌడ్ ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్ మారగోని అశోక్ గౌడ్ చౌటుప్పల మున్సిపల్ టిడిపి అధ్యక్షులు సుంకరి జంగయ్యగౌడ్ గోషిక పాండు చిలువేరు రాజు మండల టిడిపి కార్యవర్గ కార్యదర్శి తడక కోటేశ్వర్ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు గోవిందా చారి శ్రీనివాస్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు